www.visalaandhra.com

శుక్రవారం
16-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 174
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మీడియా స్వేచ్ఛకు కళ్లెం
జర్నలిస్టుల 'జైలర్'గా ఇరాన్

2లో

సర్వం సిద్ధం

నేటి నుంచి ఏఐటీయూసీ జాతీయ మహాసభలు

- కార్మిక పోరాటగడ్డ అలప్పుజ ముస్తాబు
- జెండా ఊరేగింపులకు విశేష స్పందన
- రేపు ప్రతినిధుల సభ

అలప్పుజ నుంచి డి.సోమసుందర్

ఐదురోజులపాటు జరగనున్న ఏఐటీయూసీ జాతీయ మహాసభలు కేరళ రాష్ట్రం అలప్పుజ(ఆలెప్పీ)లో శుక్రవారం సాయంత్రం ప్రారంభం కానున్నాయి. మహాసభల కోసం అలప్పుజ నగరాన్ని అరుణ పతాకాలతో, తోరణాలతో, బ్యానర్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రకరకాల పోస్టర్లు, హోర్డింగులు ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. అలెప్పీ మునిసిపల్ స్టేడియంలో కార్మికనేత ,అమరజీవి గురుదాస్ దాస్‌గుప్తా నగర్‌లో మహాసభల ప్రారంభ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.

మహాసభల గౌరవార్థం కేరళలోని వివిధప్రాంతాల నుండి బయలు దేరిన పతాకయాత్రలు, కాగడా జాతాలు ఆ సమయానికి గురుదాస్ దాస్‌గుప్తా నగర్‌కు చేరుకుంటాయి. నాయకులు వాటిని స్వీకరిస్తారు. ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రామేంద్ర కుమార్ తొలుత పతాకావిష్కరణ చేస్తారు. ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మహాసభల ప్రారంభ సూచకంగా జ్యోతి ప్రజ్వలన చేస్తారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయకార్యదర్శి, రాజ్యసభ సభ్యులు బినయ్ విశ్వం ప్రారంభిస్తారు. ప్రతినిధుల సభ శనివారం ఉదయం 10 గంటలకు గురుదాస్ దాస్‌గుప్తా నగర్‌లో ప్రారంభమవుతుంది. ప్రధానకార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మహాసభలో ప్రారంభోపన్యాసం చేస్తారు. మహాసభల ముగింపు సందర్భంగా డిసెంబర్ 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు అలెప్పి బీచ్‌లో భారీ బహిరంగసభ జరుగుతుంది. మహాసభల సందర్భంగా వివిధ అంశాలపై సెమినార్లు జరుగుతాయని సీపీఐ కేరళ రాష్ట్రసమితి కార్యదర్శి కానమ్ రాజేంద్రన్ గురువారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభ చర్చిస్తుందని, పోరాట కార్యక్రమాన్ని ఖరారు చేస్తుందని రాజేంద్రన్ వివరించారు. ఏఐటీయూసీ 42వ జాతీయ మహాసభలకు దేశం నలుమూలల నుంచి 56 లక్షల మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 1500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 103 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. మహాసభల కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి బయలుదేరిన ప్రతినిధి బృందానికి గురువారం సాయంత్రం విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద ఏఐబీఈఏ సీనియర్ నేత కె.రాధాకృష్ణ అరుణ పతాకాన్ని ఊపి ప్రయాణాన్ని ప్రారంభించారు. రాధాకృష్ణను ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు సన్మానించారు.

ఏపీ, తెలంగాణలో
అధికం

- పెట్రో ధరలపై కేంద్రం వివరణ
- మరో నాలుగు రాష్ట్రాల్లోనూ ఎక్కువేనని వెల్లడి
- బీజేపీయేతర రాష్ట్రాల్లోనే అంటూ సమర్థన

న్యూఢిల్లీ:
దేశంలో విపరీతంగా పెరిగిన పెట్రో ధరలపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం నిందించుకుంటున్నాయి. ధరల పెరుగుదలకు మీరంటే మీరు కారణమని ఆరోపించుకుంటున్నాయి. అదేసమయంలో పెట్రో ఉత్పత్తుల ధరలపై గురువారం లోక్‌సభలో సభ్యులు కేంద్రాన్ని ప్రశ్నించారు. దీనికి మోదీ సర్కారు బీజేపీ యేతర రాష్ట్రాలపై నెపం నెట్టేసింది. దేశంలో బీజేపీయేతర పార్టీలు పాలిస్తున్న ఆరు రాష్ట్రాల్లో పెట్రో ఉత్పత్తులపై వ్యాట్ తగ్గించలేదని తెలిపింది. అందువల్ల ఆయా రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని పేర్కొంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, జార్ఖండ్‌లో వ్యాట్ తగ్గించలేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ లోక్‌సభలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినట్లు మంత్రి హర్దీప్ సింగ్ చెప్పుకొచ్చారు. దీనికి కొనసాగింపుగా ప్రజలపై భారం తగ్గించడం కోసం కొన్ని రాష్ట్రాలు వ్యాట్‌ను తగ్గించాయని తెలిపారు. లోక్‌సభలో మంత్రి ఈ ప్రకటన చేస్తుండగా ప్రతిపక్ష పార్టీల సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చౌకగా పెట్రోల్ లభిస్తున్న దేశాల జాబితాలో భారత్ ఒకటని మంత్రి తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం వల్ల దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు రూ.27,276 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో తమ తమ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్‌ను తగ్గించేందుకు ఒప్పించాలని ప్రతిపక్ష పార్టీల లోక్‌సభ సభ్యులను హర్దీప్ సింగ్ కోరారు. భారత చమురు అవసరాల్లో 85 శాతానికి

పైగా దిగుమతి చేసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లోని ధరలకు అనుగుణంగానే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఉంటాయన్నారు. వినియోగదారులకు విక్రయించే ధరలో చమురు కొనుగోలు ఖర్చు, మారకపు రేటు, రవాణా వ్యయం, రిఫైనరీ మార్జిన్, డీలర్ కమీషన్, కేంద్ర ప్రభుత్వ పన్నులు, రాష్ట్ర ప్రభుత్వ వ్యాట్ వంటివన్నీ భాగమై ఉంటాయన్నారు. 2020 నవంబరు నుంచి 2022 నవంబరు మధ్య భారత్ కొనుగోలు చేసిన చమురు ధర సగటున 102 శాతం పెరిగినట్లు హర్దీప్ సింగ్ తెలిపారు. అదే సమయంలో దేశీయంగా పెట్రోల్ రిటైల్ ధర 18.95 శాతం, డీజిల్ ధర 26.5 శాతం మాత్రమే పెరిగిందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 6 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలు సవరించలేదని హర్దీప్ సింగ్ తెలిపారు. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో కంపెనీలు రూ.27,276 కోట్ల నష్టాలు చవిచూసినట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరల ప్రభావం సామాన్యులపై ఉండొద్దనే కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు ఎక్సైజ్ సుంకం తగ్గించిందని అన్నారు.

జమిలి ఎన్నికలే ఉత్తమం

కేంద్రమంత్రి రిజిజు పునరుద్ఘాటన



న్యూఢిల్లీ:
జమిలి ఎన్నికలే ఉత్తమమని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టంచేసింది. రాజ్యసభలో సభ్యుల ప్రశ్నకు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు గురువారం ఈ మేరకు సమాధానం చెప్పారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పుకొచ్చారు. 1951, 1952, 1957, 1962, 1967లో జమిలి ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. 1968, 69లో కొన్ని అసెంబ్లీలు నిర్ణీత గడువు కంటే ముందే రద్దుకావడంతో జమిలి ఎన్నికలకు అంతరాయం కలిగిందని రిజుజు చెప్పారు. విడివిడిగా ఎన్నికల నిర్వహణతో బడ్జెట్ పెరిగిపోతోందని ఆయన అన్నారు. పరిపాలనలో సుస్థిరత కోసం జమిలి ఎన్నికలే మేలని లా కమిషన్ తన 170వ నివేదికలోనూ సూచించినట్లు మంత్రి చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావిస్తూనే ఉన్నారు. అనేక మంది మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఈ నిర్ణయాన్ని సమర్థిస్తున్నప్పటికీ జమిలి ఎన్నికల నిర్వహణపై కొన్ని పార్టీల నేతల్లో ఇప్పటికీ అపోహలు, ఆందోళనలున్నాయి. వారి ఆందోళనలను తొలగించేందుకు కేంద్రం మరింత కసరత్తు చేయాల్సి ఉంటుందని, దేశవ్యాప్తంగా మరింత చైతన్యం తీసుకురావాలని రాజకీయ పండితులు సూచిస్తున్నారు.

పంజాబ్‌లో రైతుల నిరసన 2లో

లౌకిక శక్తులు ఏకం కావాలి

- బీజేపీని గద్దె దించడమే లక్ష్యం
- మోదీకి జగన్ వత్తాసు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- దాసరిభవన్‌కు వచ్చిన గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
లౌకిక శక్తులు, కమ్యూనిస్టులు ఏకమై 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. దేశ రాజకీయ పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయని, లౌకిక పార్టీల మధ్య సుహృద్భావ వాతావరణం అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన గిడుగు రుద్రరాజు తనపార్టీ ముఖ్య నేతలతో కలిసి గురువారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం - మిగతా 2 లో

జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ విడుదల

దేశంలోని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా నిర్వహించే జేఈఈ మెయిన్-2023 పరీక్ష తేదీల కోసం లక్షలాది మంది విద్యార్థుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. జేఈఈ మెయిన్ 2023 నోటిఫికేషన్‌ను జాతీయ పరీక్షల మండలి(ఎన్‌టీఏ) గురువారం విడుదల చేసింది. 2లో

దిల్లీకి అమరావతి రైతులు

- రేపు జంతర్‌మంతర్ వద్ద ధర్నా
- ప్రత్యేక రైలులో ఉద్యమకారులు
- సీపీఐ, కాంగ్రెస్ సంఘీభావం

8లో

ఇదీ లోకం!

అభివృద్ధి,అభివృద్ధి అంటున్నారు ఇదేనా? బాబోయ్!

2023 ప్రభుత్వ సెలవుల జాబితా



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
రాష్ట్ర ప్రభుత్వం 2023 సంవత్సరానికిగాను సాధారణ, ఐచ్ఛిక (ఆప్షనల్) సెలవుల జాబితాను ఎట్టకేలకు ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ సాధారణ విభాగం (జీఏడీ) ముఖ్యకార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీజేశారు. ఇందులో సాధారణ సెలవులు 23, ఐచ్ఛిక సెలవులు 22 ఉన్నాయి. వాటి వివరాలు ఈ కింది విధంగా:

సాధారణ సెలవులు: జనవరి 14, శనివారం–భోగి, 15 ఆదివారం–సంక్రాంతి, 16 సోమవారం–కనుమ, 26 గురువారం–రిపబ్లిక్‌డే. ఫిబ్రవరి 18 శనివారం–మహాశివరాత్రి, మార్చి8 బుధవారం–హోలీ, 22 బుధవారం–ఉగాది, 30 గురువారం–శ్రీరామనవమి, ఏప్రిల్5 బుధవారం–జగ్జీవన్‌రామ్ జయంతి, 7 శుక్రవారం–గుడ్ ఫ్రైడే, 14 శుక్రవారం– అంబేద్కర్ జయంతి, 22 శనివారం–రంజాన్, జూన్ 29 గురువారం –బక్రీద్, జులై 29 శనివారం– మొహర్రం, ఆగస్టు 15 మంగళవారం–స్వాతంత్ర్య దినోత్సవం, సెప్టెంబరు 6 బుధవారం–శ్రీకృష్ణ జన్మాష్టమి, 18 సోమవారం–వినాయక చవితి. 28 గురువారం–మిలాదునబి, అక్టోబరు2 సోమవారం–మహాత్మాగాంధీ జయంతి, 22 ఆదివారం–దుర్గాష్టమి, 23 సోమవారం–విజయదశమి, నవంబరు - మిగతా 2 లో

సీడీపీఓ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

- ఏపీపీఎస్సీ ద్వారా నియామకాలు
- అంగన్‌వాడీల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు
- మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్షలో సీఎం జగన్

2లో

శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) పోస్టుల భర్తీకి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ద్వారా మొత్తం 61 పోస్టుల భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో సంబంధిత అధికారులకు సూచించారు.

ఏపీలో మరో 11 పట్టణాల్లో
'స్వచ్ఛ గాలి'

కేంద్ర పర్యావరణశాఖ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం కింద గాలి నాణ్యతను పెంచేందుకు ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నంతోపాటు అదనంగా మరో 11 పట్టణాలను ఎంపిక చేసినట్లు పర్యావరణ శాఖ సహాయ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే వెల్లడించారు. రాజ్యసభలో గురువారం వైసీపీ సభ్యుడు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు - మిగతా 2 లో

ఐరాస మండలిలో ఇరాన్‌పై ఓటింగ్‌కు భారత్ దూరం

ఐరాస: ఐరాస మహిళా కమిషన్ నుంచి ఇరాన్‌ను తొలగించేలా ముసాయిదా తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి ఆర్థిక-సామాజిక మండలి ఆమోదించింది. ఈ క్రమంలో జరిగిన ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉన్నది. 2022 సెప్టెంబరు నుంచి ఇరాన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఐక్యరాజ్య సమితి ఆర్థిక-సామాజిక మండలి (ఈసీఓఎస్ఓసీ) తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేసింది. మహిళా సాధికారత, లింగ సమానత్వం ప్రోత్సాహానికి అంతర్జాతీయ సంఘం కట్టుబడి ఉండగా అందుకు భిన్నంగా ఇరాన్ వ్యవహరిస్తోందని తెలిపింది. దీంతో 2022-26 వరకు కొనసాగే 'కమిషన్ ఆన్ ది స్టేటస్ ఆఫ్ ఉమెన్'లో ఇరాన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని అమెరికా ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకు 29 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా బొలీవియా, చైనా, కజకస్తాన్, నికరాగ్వా, నైజీరియా, ఒమన్, రస్యా, జింబాబ్వే వ్యతిరేకించాయి. భారత్, బంగ్లాదేశ్, ఇండోనేసియా, మారిషస్, మెక్సికో, థాయిలాండ్‌తో సహా 16 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి.

పెరూలో అత్యవసర పరిస్థితి

దేశవ్యాప్తంగా మిన్నంటిన నిరసనలు - హింసాత్మక పరిణామాలు

సంయమనం పాటించాలని ప్రజలకు కొత్త అధ్యక్షురాలి పిలుపు

లిమా: పెరూలో 30 రోజుల ఎమర్జెన్సీ ప్రకటించారు. మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లోపై వేటు క్రమంలో నూతన అధ్యక్షురాలిగా దీనా బొలుర్టే బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. నిరసనల్లో హింస చెలరేగింది. దీంతో పరిస్థితిని అదుపు చేసేందుకు నిషేధాజ్ఞలు విధిస్తూ ఎమర్జెన్సీ ఆదేశాలను దీనా జారీ చేశారు. సంయమనం పాటించాలంటూ ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. తనకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్న వారంతా శాంతించాలని అధ్యక్షురాలు దీనా కోరారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్న ప్రజల డిమాండుపై స్పందిస్తూ ఇందుకు ఏడాది సమయం పట్టవచ్చు అని చెప్పారు. 'పెరూలో రక్తపాతం వద్దు' అని ఆమె నొక్కిచెప్పారు. సోదర-సోదరీమణులారా మీ అందరికి నేను చెప్పేది ఒక్కటే... శాంతించండి. సంయమనం పాటించండి. 80వ, 90వ దశకంలో ఇటువంటి పరిస్థితులను మనం అనుభవించాం. బాధాకరమైన గతచరిత్ర మళ్లీ పునరావృతం కావాలని మనం కోరుకోం' అని ప్రజలనుద్దేశించి అధ్యక్షురాలు దీనా అన్నారు. ఇదిలావుంటే, ఎమెర్జెన్సీ విధించిన క్రమంలో పోలీసులతో పాటు సాయుధ దళాలను దేశంలో మోహరించినట్లు రక్షణ మంత్రి లూయిస్ ఒటారోలా వెల్లడించారు. ప్రజలు ఎవ్వరూ ఒక చోట గుమ్మిగూడేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతి లేదని ఆయన తెలిపారు.

సీడీపీఓ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) పోస్టుల భర్తీకి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ద్వారా మొత్తం 61 పోస్టుల భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో సూచించారు. ఇంకా ఖాళీగా ఉన్న మిగతా పోస్టులనూ భర్తీ చేయాలన్నారు. అదే సమయంలో అంగన్‌వాడీలలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని, నాడు-నేడు కింద చేపడుతున్న పనులను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోలని కూడా ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీలలో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం, మంచి వాతావరణాన్ని కల్పించడం ముఖ్యమన్నారు. అంగన్‌వాడీలలో సార్టెక్స్ రైస్ సరఫరా చేయాలని, న్యూట్రిషన్ కిట్‌లో నాణ్యతపై రాజీ వద్దని సూచించారు. అంగన్‌వాడీలలో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలలో అన్నింటా నాణ్యత పెరగాలన్నాలి. గతంలో కంటే సంతృప్తికరమైన వసతులు కల్పించాలని అధికారులకు జగన్ స్పష్టం చేశారు. అంగన్‌వాడీల్లో కరికులమ్ (బోధనాంశం) కూడా మారాలన్నారు. పిల్లలకు చిన్నవయసులోనే మెదడు పరిణతి చెందుతుందని, ఏ విషయాన్నైనా త్వరగా గ్రహించగరని, వారికి అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. కరికులమ్ మార్పు కోసం అవసరమైతే ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం సూచించారు. కొత్త సూపర్‌వైజర్ల సాయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో విధిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. 'తనిఖీలు, నాణ్యత, నాడు-నేడు'కు సంబంధించి కచ్చితమైన మార్పు కార్యాచరణలో కనిపించాలని ఆయనన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, హౌసింగ్, మహిళా శిశు సంక్షేమ శాఖలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వీటిలో మార్పుల కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నదని తెలిపారు. ఈ శాఖల్లో సిబ్బంది నియామకాలు చేపట్టడమే కాదు ఎలాంటి అవసరమున్నా ప్రభుత్వం సహకరిస్తుందని జగన్ చెప్పారు. మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి, మహిళ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, పాఠశాల విద్యాశాఖ (మౌలిక సదుపాయాలు) కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, పౌర సరఫరాల శాఖ ఎండీ జి.వీరపాండ్యన్, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే ఇతర ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

జడ్జీల నియామకంలో కేంద్రం పాత్ర పరిమితం

కొలీజియం వ్యవస్థపై రిజిజు వ్యాఖ్య

న్యూఢిల్లీ: న్యాయమూర్తుల నియామకంలో కేంద్రప్రభుత్వం పాత్ర పరిమితంగా ఉంటుందని కేంద్ర న్యాయమంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కొత్త వ్యవస్థ ఏర్పాటు అయ్యేంత వరకు ఉన్నత న్యాయస్థానాల్లో నియామకాల్లో సమస్య కొనసాగుతుందని ఆయన గురువారం రాజ్యసభకు తెలిపారు. కొలీజియం సిఫార్సు చేసినవి తప్ప మిగతా పేర్లను పరిగణనలోకి తీసుకునే అవకాశం కేంద్రప్రభుత్వానికి ఉండదని, న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వానిది పరిమిత పాత్ర అని సభలో అడిగిన ఒక ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. జడ్జీల నియామకానికి సంబంధించిన కొలీజయం వ్యవస్థపై సుప్రీంకోర్టు, కేంద్రానికి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో రిజిజు కొలీజియం వ్యవస్థపై మరోసారి విమర్శలు చేశారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అధిక సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చిన ఆయన'న్యాయమూర్తుల ఖాళీల కారణంగా దాదాపు ఐదు కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం' అని అన్నారు. పెండింగ్ కేసులు తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని చెప్పారు.

న్యాయమూర్తుల నియామకాల్లో ప్రభుత్వానికి పరిమిత పాత్ర ఉందన్నారు. కొలీజియం పేర్లను ఎంపిక చేస్తుందని, జడ్జీలను నియమించే హక్కు కేంద్రానికి లేదని అన్నారు. నాణ్యత, భారతదేశ వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా, మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించేలా పేర్లను పంపాలని ప్రభుత్వం తరచుగా భారత ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తులకు తెలిపిందన్నారు.

అగ్ని-5 పరీక్ష విజయవంతం

5వేల కిమీల లక్ష్యాలు ఛేదించగల అణుక్షిపణి

న్యూఢిల్లీ: అగ్ని-5 అణుక్షిపణిని భారత్ గురువారం విజయవంతంగా పరీక్షించింది. ఐదు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను సైతం ఎంతో కచ్చితత్వంతో సునాయాసంగా ఛేధింగల సామర్థ్యం ఈ క్షిపణికి ఉంది. అగ్ని-5 అణు బాలిస్టిక్ క్షిపణి రాత్రి పరీక్షలను భారత్ విజయవంతంగా పూర్తి చేసిందని రక్షణశాఖ ప్రకటన తెలిపింది. క్షిపణిలోని కొత్త సాంకేతికతలు, పరికరాల పనితీరును పరీక్షించినట్లు వెల్లడించింది. నూతన సాంకేతికతు, పరికరాల వల్ల క్షిపణి బరువు గతంలో కంటే తగ్గిందని తెలిపింది. తాజా పరీక్షతో అగ్ని-5 క్షిపణి పూర్తి సామర్థ్యం రుజువు అయిందని పేర్కొంది.

- ప్రపంచంలో పాత్రికేయుల రికార్డు నిర్బంధాలు
- 2022లో 533 మంది అరెస్టు
- వీరిలో సగానికిపైగా ఆసియా, మధ్యతూర్పు దేశాలలో బందీ
- ఎన్జీవో 'రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్' నివేదికలో వెల్లడి

మీడియా స్వేచ్ఛకు కళ్లెం

జర్నలిస్టుల 'జైలర్'గా ఇరాన్

పారిస్: ప్రపంచవ్యాప్తంగా మీడియా గొంతు నొక్కేస్తున్నారు. పాత్రికేయుల కలానికి సంకెళ్లు వేస్తున్నారు. నిరంకుశ-బూర్జువ ప్రభుత్వాలు తమకు అనుకూలంగాలేని వార్తలను సేకరించే పాత్రికేయులపై కక్షసాధింపుకు దిగుతున్నాయి. వారిని నిర్బంధానికి గురిచేసి జైళ్ల నుంచి బయటకు రాకుండా వేధిస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల జర్నలిస్టులు దారుణహత్యలకు గురవుతున్నారు.

జర్నలిస్టులపై నిర్బంధ కాండ కొనసాగించే దేశాల జాబితాలో ఇరాన్ చేరింది. ఈ దేశంలో ప్రజా నిరసనల క్రమంలో జర్నలిస్టుల నిర్బంధాలు పెరుగగా, ప్రపంచంలో పాత్రికేయుల నిర్బంధాల రికార్డు నెలకొల్పినట్లు అయింది. ప్రపంచ దేశాల్లో 2022లో 533 మంది మీడియా వృత్తిదారులు అరెస్టు కాగా జర్నలిస్టుల 'జైలర్' దేశాలుగా చైనా, మియన్మార్, ఇరాన్, వియత్నాం, బెలారస్ ఉన్నాయి. అరెస్టుకు గురైన సగానికిపైగా జర్నలిస్టులు ఈ దేశాల నిర్బంధంలో ఉన్నట్లు ఫ్రాన్స్‌కు చెందిన ఎన్జీవో 'రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ (ఆర్ఎస్ఎఫ్) నివేదిక వెల్లడించింది. 2021లో 488 మంది పాత్రికేయులు అరెస్టుకు గురైనట్లు తెలిపింది. నియంత పాలనలో పాత్రికేయులకు స్వేచ్ఛ లేదని ఆర్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి క్రిస్టోఫే డెలోరియే ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. జర్నలిస్టుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, బహుళత్వానికి సంఘీభావాన్నీ తెలపారు. నిరంకుశ ప్రభుత్వాల మెడలు వంచాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. గతేడాది వరకు జర్నలిస్టులను అధికంగా నిర్బంధించే దేశాల జాబితాలో ఇరాన్ లేదు.గానీ సెప్టెంబరులో 22ఏళ్ల అమినీ కస్టడీలో మరణించిన అనంతరం ప్రజాందోళనలు మిన్నంటిన క్రమంలో 34మంది మీడియా సిబ్బంది అసాధారణ రీతిలో నిర్బంధానికి గురయ్యారు.

మహిళా జర్నలిస్టులే టార్గెట్

నిరంకుశ ప్రభుత్వాలు మహిళా గళాన్ని అణచివేసే లక్ష్యంతో మహిళా జర్నలిస్టులను టార్గెట్‌గా చేసుకుంటాయి. ప్రపంచవ్యాప్తంగా మహిళా జర్నలిస్టుల నిర్బంధకాండ ఎక్కువైంది. 2021లో 60 మంది మహిళా జర్నలిస్టులు జైళ్లకు పంపబడ్డారు. 2022 జైళ్లపాలైన మహిళా జర్నలిస్టుల సంఖ్య 78కి పెరిగింది. ఇరాన్‌లో నిరసనల క్రమంలో అరెస్టుకు గురైన 15 మంది మహిళా జర్నలిస్టుల్లో నిలోఫర్ హమీదీ, ఎలాహే మహమ్మదీ ఉన్నారు. అమీని మరణంపై ప్రజాదృష్టిని ఆకర్షించినందుకు ఈ జర్నలిస్టులకు ఉరిశిక్ష పడే అవకాశమున్నది. మహిళల గొంతక నొక్కివేసే విధంగా ఇరాన్ యంత్రాంగం వ్యూహాత్మక అణచివేతను సాగిస్తోందనేందుకు ఈ పరిణామాలు అద్దంపడుతున్నట్లు ఆర్ఎస్ఎఫ్ పేర్కొంది. ఈ ఎన్జీవో సోమవారం నర్గీస్ మహమ్మదీని శాంతి-శౌర్య పురస్కారంతో సన్మానించింది. నర్గీస్ దశాబ్దానికిపైగా నిర్బంధంలో ఉన్నారు. అరెస్టుకు గురైన జర్నలిస్టుల్లో మూడోవంతు ఆసియా, మధ్యతూర్పు దేశాల్లోనే ఉన్నట్లు ఆర్ఎస్ఎఫ్ నివేదిక పేర్కొంది. ఉక్రెయిన్‌పై యుద్ధం క్రమంలో రష్యాలోనూ జర్నలిస్టుల అణచివేత పెరిగినట్లు తెలిపింది. యుద్ధంలో చనిపోయిన జర్నలిస్టుల సంఖ్య 57కు పెరిగిందని పేర్కొంది. 2022లో హత్యకు గురైన జర్నలిస్టుల్లో దాదాపు 80శాతం మంది కేవలం వారి విధి ధర్మానికి కట్టుబడినందుకు లక్ష్యంగా చేసుకోబడ్డారని ఆర్ఎస్ఎఫ్ పేర్కొంది.

'అమరావతి స్మార్ట్ సిటీ'లపై కేంద్రం స్పందించాలి

జయదేవ్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాజధాని అమరావతిలో స్మార్ట్ సిటీల ప్రాజెక్టులు కార్యరూపం దాల్చక పోవడంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని గురువారం లోకసభ ప్రశ్నోత్తరాల సమయంలో గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ అడిగారు. ఏపీకి కొత్త రాజధాని అమరావతి, మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయడంతో పాటు నగర అభివృద్ధి ప్రాజెక్టులు కూడా చేపట్టామన్నారు. వివిధ ప్రాజెక్టుల పనులు 2019 వరకు బాగానే సాగాయి. కానీ, ఆ తర్వాత పనులను మంత్రిత్వ శాఖ ఆపేసింది. 20 ప్రాజెక్టుల కింద ఏపీలో అమరావతికి స్మార్ట్ సిటీ మిషన్ కింద రూ.2 వేల కోట్లు విడుదల చేశారు. కానీ, ఇప్పటి వరకు ఒక్క పని కూడా పూర్తి కాలేదని, దీని వెనుక ఉన్న కారణాలు, ప్రభుత్వం ప్రాజెక్టులను ఎప్పటికి పూర్తి చేస్తారని అడిగారు. దీనిపై కేంద్ర పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరి మాట్లాడుతూ కేంద్రం వివిధ ప్రాజెక్టుల కింద రూ.488 కోట్లు విడుదల చేయగా మొత్తం ఖర్చుపెట్టిందని, రాష్ట్రం కూడా రూ.488 కోట్లు విడుదల జేయగా రూ.290 కోట్లు ఖర్చు పెట్టింది. విడుదల చేసిన మొత్తంలో 80 శాతం ఖర్చు అయిందని, మంత్రిత్వ శాఖ అధికారులతో సంప్రదించి లిఖితపూర్వకంగా పూర్తి స్థాయిలో మరిన్ని వివరాలు తెలియజేస్తానని సమాధానం ఇచ్చారు.

తెనాలి-గుంటూరు రైల్వే విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేయాలి

18 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో మూడేళ్ల క్రితం చేపట్టిన తెనాలి-గుంటూరు విద్యుద్దీకరణ పనులు ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయని, రైల్వే అభివృద్ధి పనుల గురించి ఎంపీ జయదేవ్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్ అమలులో జాప్యం వల్ల సమయం, ఖర్చు రెండూ అధికమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ లైను కేవలం 24.5 కిలోమీటర్లు మాత్రమే ఉంది. దీనికి అవసరమైన అన్ని అనుమతులు లభించాయి. పనులు వేగవంతం చేయడంతో పాటు కొత్త గుంటూరు స్టేషన్ వరకు పొడిగించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గుంటూరు-తెనాలి మధ్య వడ్లమూడిలో డెయిరీ, పశుగ్రాసం ఫ్యాక్టరీ, విశ్వవిద్యాలయం, దాని అనుబంధ కళాశాలలు ఉన్నాయి. హాస్పిటల్స్‌తో కూడిన రెండు మెడికల్ కాలేజీలు కూడా త్వరలో వచ్చే అవకాశం ఉంది. వడ్లమూడి చేరుకోవడానికి ప్రస్తుతం ప్రజలకు రోడ్డు సౌకర్యం మాత్రమే ఉంది. రైల్వేకు సొంత భూములున్న సుద్దపల్లి సమీపంలో హాల్ట్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు, భవిష్యత్‌లో రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడుతుంది కాబట్టి, ఈ ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీ జయదేవ్ రైల్వే మంత్రిని అభ్యర్థించారు.

ఆ శరీర భాగాలు శ్రద్ధా వాకర్‌వే

డీఎన్ఏ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాల్‌సెంటర్ ఉద్యోగి శ్రద్ధా వాకర్ హత్య కేసులో మెహ్రౌలీ అటవీ ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న శరీర భాగాలు శ్రద్ధా వాకర్‌వేనని నిర్ధారణ అయ్యింది. ఆమె తండ్రి నుంచి సేకరించిన డీఎన్ఏ నమూనాతోఅవి సరిపోలినట్లు తాజా నివేదికలో వెల్లడైంది. 'వివిధ ప్రాంతాల్లో లభించిన ఎముకల డీఎన్ఏ నివేదిక పోలీసులకు చేరింది. అవి శ్రద్ధా వాకర్ తండ్రి నమూనాతో సరిపోలాయి' అని అధికార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు శ్రద్ధా వాకర్ హత్య కేసులో వాస్తవాలను ధ్రువీకరించుకునేందుకు దిల్లీ పోలీసులు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆఫ్తాబ్‌కు పాలిగ్రాఫ్‌తో పాటు నార్కో పరీక్షలు కూడా పూర్తి చేశారు. ఆమె శరీర భాగాలను 35 ముక్కలు చేసి పడవేసినట్లు అనుమానిస్తుండగా.. వాటిలో ఇప్పటివరకు 13 భాగాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు మిగతా వాటికోసం గాలిస్తూనే ఉన్నారు. తన కుమార్తెను అతి దారుణంగా హత్య చేసిన ఆఫ్తాబ్ పూనావాలాను ఉరితీయాలని శ్రద్ధా వాకర్ తండ్రి వికాస్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే మీడియా ముందుకు వచ్చిన ఆయన.. మహారాష్ట్ర పోలీసులు సమయానికి స్పందించి ఉంటే తన కుమార్తె బతికేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు దిల్లీ పోలీసుల దర్యాప్తు సరైన దిశగానే సాగుతోందన్న ఆయన పేర్కొన్నారు.

2023 ప్రభుత్వ సెలవుల జాబితా

(మొదటిపేజీ తరువాయి)

12 ఆదివారం-దీపావళి, డిసెంబరు 25 సోమవారం -క్రిస్మస్ పండుగలకు సెలవులు ప్రకటించారు.

ఐచ్ఛిక సెలవులు: జనవరి1-ఆదివారం-నూతన సంవత్సరం, ఫిబ్రవరి5 ఆదివారం- హజరుల్లా జయంతి, మార్చి 7శుక్రవారం-షాబీబర్త్, ఏప్రిల్ 4 మంగళవారం-మహవీర్ జయంతి, 18 మంగళవారం-షాభీఖదర్, 21 శుక్రవారం-జుమాతుల్‌వాద, 23 ఆదివారం-బసవ జయంతి, 24 సోమవారం-షాహదత్ అజరత్ అలీ, మే 5 శుక్రవారం-బుద్ధపౌర్ణమి, జూన్ 2 మంగళవారం-రథయాత్ర, జులై 6 గురువారం ఈద్-ఈ-గధీర్, 28 శుక్రవారం-తొమ్మిదోరోజు మొహర్రం, ఆగస్టు 16 బుధవారం-పార్సీ న్యూఇయర్స్ డే, 25 శుక్రవారం వరలక్ష్మీవ్రతం, సెప్టెంబరు5 మంగళవారం-అర్భీన్, 9 శనివారం-అజరద్ సయ్యద్ మహమ్మద్ జువన్‌పురి మెహిద్ జన్మదినం, అక్టోబరు 14శనివారం-మహాలయ అమవాస్య, 24 మంగళవారం-విజయదశమి (తిథి ద్వాయమ్), 26 గురువారం యాజ్-దహూమ్-షరీఫ్, నవంబరు 27 సోమవారం- కార్తీకపౌర్ణమి, గురునానక్ జయంతి, డిసెంబరు 24 ఆదివారం క్రిస్మస్ ఈవ్, 26 మంగళవారం-బాక్సింగ్ డే.

'తాజా' 'సహజమైన'వంటి విశేషణల వాడకాన్ని తగ్గించాలి

న్యూఢిల్లీ: ఆహారపదార్థాల లేబుళ్లు, బ్రాండ్ పేర్లు, ప్రకటనలకు సంబంధించిన ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆహార పదార్థాల తయారీ కంపెనీలకు కీలక సూచనలు చేసింది. తాజా, సహజమైన, నిజమైనవంటి విశేషణ పదాల వాడకాన్ని పరిమితం చేయాలని సూచించింది. ఇవి వినియోగదారులను తదోవ పట్టించే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు తాజగా ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. కంపెనీలు విశేషణాలు వాడినప్పుడు సంబంధిత ప్యాక్‌పై తప్పనిసరిగా 'డిస్‌క్లెయిమర్' రాయాలని సూచించింది. 'అది ట్రేడ్‌మార్క్, బ్రాండ్‌నేమ్ సూచించేదే తప్ప.. ఆహార పదార్థం నిజస్వభావాన్ని సూచించదు' అని స్పష్టంగా అందులో పేర్కొనాలి అని తెలిపింది. అక్షరాలు కనిపించేలా ఫాంట్ సైజ్‌తో ముద్రించాలని సూచించింది. ఈ కొత్త నిబంధనలు డిసెంబర్ 13 నుంచి అమల్లోకి వచ్చాయి. వ్యాపార సంస్థలను జవాబుదారీగా ఉంచడం సహా వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాలనే ఉద్దేశంతో ఈ నిబంధనలు తీసుకొచ్చినట్లు తెలిపింది. ఆహారపదార్థాల్లో పోషక విలువలకు సంబంధించిన అంశంపై ఎస్ఎఫ్ఎస్ఏఐ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది.

పంజాబ్‌లో రైతుల నిరసన

అమృత్‌సర్: పంజాబ్‌లో రైతులు రోడ్కెక్కారు. పంజాబ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ(కేఎంఎస్‌సీ) నేతృత్వంలో గురువారం రాష్ట్రంలోని వివిధ టోల్ ప్లాజాల వద్ద నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర, నష్టపరిహారం సహా తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే ఆమోదించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కేఎంఎస్‌సీ గురువారం నుంచి నెల రోజుల పాటు రాష్ట్రంలోని 18 టోల్ ప్లాజాల వద్ద నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. నిరసన సందర్భంగా రైతులు టోల్ ప్లాజాల గుండా వెళ్లే ఏ వాహనానికైనా రుసుము కట్టించుకోడానికి అనుమతించరని, జనవరి 15 వరకు రాష్ట్రంలోని ప్రయాణికులకు టోల్‌ప్లాజాలన్నీ ఉచితమని కేఎంఎస్‌సీ ప్రధాన కార్యదర్శి సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. టోల్ ప్లాజాల ఉద్యోగులకు ఈ నెల జీతాలు అందేలా చూస్తామని పంధేర్ తెలిపారు. టోల్ ప్లాజా ఆపరేటర్లు టోల్ చార్జీలు పెంచడానికి కూడా తాము అనుమతించబోమని ఆయన అన్నారు. టోల్ ప్లాజాలు అమృత్‌సర్, హోషియార్‌పూర్, తరన్ తరన్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, ఫజిల్కా, మోగా, జలంధర్, కపుర్తలలో ఉన్నాయి. కేఎంఎస్ అధ్వర్యంలో రైతులు గతంలో తొమ్మిది జిల్లాల్లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల వద్ద నిరసనలు నిర్వహించినప్పటికీ తమ డిమాండ్లను పట్టించుకోలేదని పంధేర్ అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించకపోతే రాబోయే రోజుల్లో మరిన్ని టోల్ ప్లాజాలను ఉచితం చేస్తామని ఆయన హెచ్చరించారు.

జేఈఈ మెయిన్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ: దేశంలోని ప్రఖ్యాత విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా నిర్వహించే జేఈఈ మెయిన్-2023 పరీక్ష తేదీల కోసం లక్షలాది మంది విద్యార్థుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. జేఈఈ మెయిన్ 2023 నోటిఫికేషన్‌ను జాతీయ పరీక్షల మండలి(ఎన్‌టీఏ) గురువారం విడుదల చేసింది. జేఈఈ మెయిన్ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహిస్తున్న ఎన్‌టీఏ, జనవరిలో తొలి విడత, ఏప్రిల్‌లో రెండో విడత పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. జేఈఈ మెయిన్ తొలి సెషన్‌ను జనవరి 24, 25, 27, 29, 30, 31 తేదీల్లో నిర్వహించనుండగా.. రెండో సెషన్ ఏప్రిల్ 6 నుంచి 12 వరకు జరుగుతుందని తెలిపింది. జేఈఈ మెయిన్ పరీక్షను 13 భాషల్లో (ఆంగ్లం, హిందీ, తెలుగు, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడిశా, పంజాబీ, తమిళ్, ఉర్దూ) నిర్వహించనున్నారు. తొలి సెషన్ పరీక్షకు డిసెంబర్ 15 నుంచి జనవరి 12 రాత్రి 9గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు జనవరి 12 రాత్రి 11.50 నిమిషాల వరకు గడువు విధించారు. ఏ సిటీలో పరీక్ష నిర్వహిస్తామనేది జనవరి రెండో వారంలో ప్రకటించనున్నారు. అడ్మిట్ కార్డులను జనవరి మూడో వారంలో ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. దేశంలోని ట్రిపుల్ ఐటీలు, ఎన్ఐటీ, ఇతర విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా నిర్వహిస్తోన్న జేఈఈ మెయిన్ పరీక్షలను దాదాపు 10లక్షల మంది విద్యార్థులు రాస్తుంటారు. వీరిలో టాప్ స్కోర్ సాధించిన 2.5లక్షల మంది విద్యార్థులకు ప్రఖ్యాత సంస్థలైన ఐఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తున్నారు. మరోవైపు, జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్షను జనవరిలో కాకుండా ఏప్రిల్‌లో నిర్వహించాలంటూ అనేకమంది విద్యార్థులు ట్విటర్ ద్వారా ఎన్‌టీఏ, కేంద్ర విద్యాశాఖ మంత్రికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. జనవరి-ఫిబ్రవరి మధ్యలో ఇతర పరీక్షలు ఉన్నందున రివిజన్‌కు సమయం దొరకదని.. 12వ తరగతి సిలబస్ కూడా ఇంకా పూర్తికాకపోవడంతో తమ పరిస్థితిని అర్థం చేసుకొని తొలి విడతను ఏప్రిల్‌లో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అయితే, గురువారం రాత్రి జేఈఈ మెయిన్ పరీక్షల షెడ్యూల్‌ని విడుదల చేసిన ఎన్‌టీఏ తొలి సెషన్‌ను జనవరిలో, రెండో సెషన్‌ను ఏప్రిల్‌లో నిర్వహిస్తున్నట్టుగా పూర్తి షెడ్యూల్ విడుదల చేయడం గమనార్హం.

లౌకిక శక్తులు ఏకం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

దాసరిభవన్‌కు వచ్చారు. రామకృష్ణను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. గిడుగు రుద్రరాజును రామకృష్ణ సాదరంగా ఆహ్వానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లౌకికశక్తులు, కమ్యూనిస్టులు ఏకమవ్వాలన్నారు. విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల్లో ఈ మేరకు తీర్మానించామని గుర్తుచేశారు. దేశంలో అతిపెద్ద లౌకిక పార్టీ, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే పార్టీగా కాంగ్రెస్ ఉందన్నారు. కాంగ్రెస్ లౌకిక పార్టీగా, రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో ముందుంటోందని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో లౌకికవాద పార్టీలు ఒకే వేదికపైకి వచ్చినప్పటికీ ఆ రోజు కలిసికట్టుగా ఎన్నికల్లో పోటీ చేయలేకపోయామని, అందువల్ల మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. మళ్లీ అలాంటి తప్పు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్, కమ్యూనిస్టులతోపాటు వివిధ ప్రాంతీయ పార్టీలు ఒకే వేదికను పంచుకుంటున్నాయని, ఉమ్మడి వ్యూహం రచిస్తున్నాయని వివరించారు. రాబోయే రోజుల్లో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి...ఫాసిస్టువాదం, మతోన్మాదాన్ని బీజేపీ మరింత ముందుకు తీసుకెళ్లే ప్రమాదముందని హెచ్చరించారు. గిడుగు రుద్రరాజు రాజకీయంగా ఎంతో అనుభవశాలి అని, చాలా అంశాలపై సమగ్ర అవగాహన గల నేత అని కొనియాడారు. ఆయా పార్టీల సిద్ధాంతాలు కొనసాగించుకుంటూ...కలిసికట్టుగా ఉద్యమాలు చేయాల్సిన అవసముందని చెప్పారు. రాష్ట్ర రాజకీయాలను గమనిస్తే ఎక్కడా ప్రజాస్వామ్యం లేదని, మాట్లాడటానికీ, ప్రశ్నించడానికీ, చలో విజయవాడ, చలో అసెంబ్లీ పిలుపునివ్వడానికీ ఆస్కారం లేకుండా పోయిందన్నారు. గతంలో ఎన్నడూ లేని సంప్రదాయాన్ని సీఎం జగన్ తీసుకొస్తున్నారని విమర్శించారు. జగన్ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ మోదీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని దుయ్యబట్టారు. మోదీ కనుసన్నల్లోనే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారన్నారు. ఉద్యోగులకు కనీసం వేతనాలిచ్చే పరిస్థితుల్లేవని, ఇలాంటి అనేక అంశాలపై భావసారూప్యత గల పార్టీలన్నీ ఏకమై మోదీ, జగన్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పోరాటాలు, ఆత్మబలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రం ప్రైవేట్‌పరం చేస్తుంటే...జగన్ ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు.

బీజేపీ విధానాలపై ఐక్య పోరాటం: గిడుగు రుద్రరాజు

గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ...తనను పీసీసీ అధ్యక్షుడిగా నియమించాక, తమ చిరకాల మిత్రులు, శ్రేయోభిలాషి రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశానన్నారు. చాలాకాలం నుంచి కేంద్రంలో బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్, సీపీఐ పోరాడుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. విద్యార్థి దశలో తాను ఎన్ఎస్‌యూఐలో, రామకృష్ణ ఏఐఎస్ఎఫ్‌లో ఉండి ఉద్యమించామన్నారు. భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. గిడుగు రుద్రరాజు వెంట ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు లాం తాంతియా కుమారి, మీసాల రాజేశ్వరరావు, వేల్పుల విజయలక్ష్మి, ధనేకుల మురళీమోహన్, వింట్ల సంజీవ్‌రెడ్డి, వి.గుర్నాథం, మొవ్వ మోహన్‌రావు, బి.నాగేశ్వరరావు, అన్సారీ, పీటర్‌పాల్, బషీర్ అహ్మద్, సతీశ్, అప్పల నారాయణ తదితరులు ఉన్నారు.

11 పట్టణాల్లో 'స్వచ్ఛ గాలి'

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. 15వ ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నానికి అదనంగా మరో 11 పట్టణాలను గుర్తించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన పట్టణాల్లో శ్రీకాకుళం, చిత్తూరు, ఒంగోలు, విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, అనంతపురం, కడప, కర్నూలు, గుంటూరు, నెల్లూరు ఉన్నట్లు చెప్పారు. జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం కింద పైన పేర్కొన్న పట్టణాల్లో గాలి నాణ్యత పెంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ నగరాలలో గాలి నాణ్యతను మెరుగు పరిచేందుకు పనితీరు ఆధారిత గ్రాంట్‌ను ఇస్తూ 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. ఈ గ్రాంట్ కింద విజయవాడకు 2022-23లో రూ.163 కోట్లు కేటాయించగా, 2021-22లో రూ.100.35 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. అలాగే 2022-23 వరకు విశాఖ నగరానికి రూ.148 కోట్లు కేటాయించగా, 2021-22 వరకు రూ.100.75 కోట్లు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

వచ్చేనెల 26న దేశవ్యాప్త నిరసనలు

- ఫిబ్రవరిలో చలో పార్లమెంట్
- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు
- ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దిల్లీ కేంద్రంగా నిర్వహించిన చరిత్రాత్మక రైతు ఉద్యమానికి ఏడాది పూర్తయిన సందర్భంగా, జనవరి 26న దేశవ్యాప్తంగా నిరసనలకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చినట్లు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు రావుల వెంకయ్య వెల్లడించారు. విజయవాడ దాసరిభవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు నష్టపోయే నల్ల చట్టాలని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దిల్లీ సరిహద్దుల్లో పెద్దఎత్తున ఉద్యమించారని వెంకయ్య గుర్తుచేశారు. ఆ ఉద్యమం దిల్లీ సరిహద్దులకే పరిమితం కాకుండా, అన్ని రాష్ట్రాలకూ విస్తరించిందన్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో మోదీ ప్రభుత్వం, నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి, రైతాంగానికి క్షమాపణలు కోరుకుంటున్నట్లు తెలిపి, పార్లమెంటులో ఆ దిశగా చట్టం చేసిందన్నారు. ఆ సమయంలో రైతుల సంక్షేమం కోసం మోదీ వివిధ హామీలిచ్చారని గుర్తుచేశారు. రైతులకు రుణాలు ఇస్తామనీ, కేసుల మాఫీ చేస్తామన్నారని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలుకు, రైతాంగ రుణ విముక్తికి బిల్లు తీసుకొస్తామని, చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని, రైతులపై ఏడాదిన్నర కాలంలో పెట్టిన కేసులను ఉప సంహరించుకుంటానని ప్రకటించారని పేర్కొన్నారు. ఇచ్చిన వాగ్దానాలను మోదీ భగ్నం చేయడాన్ని నిరసిస్తూ, నవంబరు 19న సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో మళ్లీ ఉద్యమం పున:ప్రారంభించాలని, దేశవ్యాప్తంగా రైతాంగ పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాలు జరిగే సమయంలో చలో పార్లమెంటుకు పిలుపునిచ్చామనీ, ఇందులో అన్ని రైతు సంఘాలు భాగస్వామ్యం అవుతాయని వివరించారు. ఈ రెండు కార్యక్రమాలను సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో అన్ని రైతు సంఘాలను కలుపుకుని నిర్వహిస్తామన్నారు. ఇప్పటికైనా మోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకోక పోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

రాష్ట్రంలోని సీఎం జగన్ ప్రభుత్వ విధానాలు రైతాంగానికి నష్టం కలిగిస్తున్నాయని, డెయిరీల వ్యవస్థను పూర్తిగా నీరుగారుస్తున్నాయని దుయ్యబట్టారు. రూ.500 కోట్ల ఆస్తులు కలిగిన చిత్తూరు డెయిరీని అమూల్‌కు 99 సంవత్సరాలపాటు లీజుకు ఇవ్వడం దుర్మార్గమని తీవ్రంగా ఖండించారు. ఈ చర్య ఏపీ పాల రైతులను మోసగించడమేనని, అమూల్‌కు వచ్చే ఆదాయం గుజరాత్‌కే పోతుందని దుయ్యబట్టారు. ఈ విధానంపై పెద్దఎత్తున రైతాంగం పోరాటం చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ ఎందుకు ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. అమూల్ డెయిరీ ఆదాయం అంతా గుజరాత్‌కు పోతోందనీ, ఏపీకి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. మైక్రో ఇరిగేషన్ పరికరాలపై 6శాతం జీఎస్టీ పన్ను విధించే పద్ధతిని కేంద్రం ప్రతిపాదిస్తే, దానిని జగన్ ప్రభుత్వం ఆమోదించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. దీనివల్ల రైతులు పూర్తిగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

తుపాను వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని వివరిస్తూ, అన్ని ప్రాంతాల్లోనూ పంటలు దెబ్బతిన్న రైతులు ఆర్థికంగా చితికిపోయారని తెలిపారు. కోతలకు వచ్చిన వరి మొత్తం నేలమట్టమైందని, మిర్చి, పత్తి, పొగాకు, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. సర్వం పంటలు ధ్వంసమైతే, ఇప్పటి వరకూ జగన్ ప్రభుత్వంగానీ, మోదీ ప్రభుత్వంగానీ రైతాంగానికి నష్టపరిహారంపై ప్రకటన చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనురిస్తున్న రైతాంగ సమస్యలపై ఉధృతమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జగన్ మాయలు, మోసాలు గుర్తించి రైతులంతా కలిసి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

రైతులకు తీవ్ర నష్టం: కేవీవీ ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పడిన భారీ వర్షాలతో రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారన్నారు. వరి ధాన్యం పండించే రైతులు, తాము కోసే పంటను పనల మీద పెట్టుకుని ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి రైతు పండించే పంటను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ వాగ్దానం ఆచరణలో అమలుకు నోచుకోలేదని, దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. వర్షాలతో రైతులు పడుతున్న ఇబ్బందులు, వారి నష్టాలపై రైతు సంఘం నేతలు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారని, వాటిపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వారం రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధుల బృందం అన్ని జిల్లాల్లో పంటలు నష్టపోయిన తీరును పరిశీలించనుందని ఆయన తెలిపారు. ఉద్యానవన శాఖలో దాదాపు రూ.8వేల హెక్టార్లలో నష్టం జరిగినట్లు ప్రభుత్వం అంచనా వేసిందని, ఇది ఇంకా అధికంగా ఉంటుందనేదీ తమ అభిప్రాయమన్నారు. దాదాపు 5లక్షల హెక్టార్ల వరకు పంట నష్టం అంచనా ఉందని, ఈ అంచనాలపై ప్రభుత్వం ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ఎక్కడికక్కడే ఉద్యమిస్తామని హెచ్చరించారు. నష్టాబోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం కల్పించాలని, రైతు పండించిన ప్రతి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నష్టం అంచనాపై వ్యవసాయశాఖ మంత్రి అధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహించాలన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మర్రీడు యలమందరావు, ఉపాధ్యక్షులు కె.కాటమయ్య, పి.జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహిళా సమాఖ్య సమరశీల పోరాటాలు

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని

విశాలాంధ్ర-పామూరు: మహిళా సమస్యల సాధన కోసం స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి సమరశీల పోరాటాలు నడిపిన ఘన చరిత్ర జాతీయ మహిళా సమాఖ్యకు ఉందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి దుర్గా భవాని తెలిపారు. గురువారం స్థానిక గుజ్జుల యలమందారెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కనిగిరి నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం గాయత్రి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గ భవాని మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, బాల్య వివాహాలు నిషేధం, బహుభార్యత్వం రద్దు, సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం, వారసత్వపు హక్కు, గృహ హింస చట్టం మొదలగు వాటిపై పోరాటాల నిర్వహించి సాధించుకున్నామని తెలిపారు. దుష్ట సంప్రదాయాలతో ఇంకా సమాజంలో మహిళ అంటే ఆట వస్తువులాగా వంటింటికే పరిమితం చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగాయని, హీన సంస్కృతిని పెంపొందించే ప్రభుత్వాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరచాలని, మెరుగైన విద్యా విధానం అందించాలని పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలను భాగస్వాములను చేయాలనీ, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక భద్రత కల్పించాలని, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని, ఇల్లు లేని నిరుపేద మహిళలందరికీ ఇల్లు కట్టించి ఇవ్వాలనే సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రావమ్మ, విజయ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై స్థానికంగా ఉద్యమాలు చేపట్టినప్పుడే ప్రభుత్వం అధికారులు దిగివస్తారని, సమస్యలు పరిష్కరింపబడతాయన్నారు. గుజ్జుల సరళాదేవి, చంద్ర రాజకుమారి, కొండపల్లి కోటేశ్వరమ్మ మొదలగు మహిళా నాయకుల ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. మండల సీపీఐ కార్యదర్శి పోతల ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి, సీఎస్‌పురం సీపీఐ మండల కార్యదర్శి పెద్ద మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను తరిమికొట్టింది ఎర్ర జెండాలే

- ప్రభుత్వాలవి రైతు వ్యతిరేక విధానాలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్

విశాలాంధ్ర-అమలాపురం: ప్రధాని మోదీ తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేసే వరకూ రాజీలేని పోరాటం చేసింది ఎర్ర జెండాలేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆక్వా రైతు సమస్యలపై గురువారం పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేగా మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం నల్లా చట్టాలను తెచ్చి రైతాంగాన్ని దెబ్బ తీయాలని చూస్తే వివిధ రాష్ట్రాల్లోని రైతాంగం పిల్లా పాపలతో ఎడ్ల బండ్లతో. దిల్లీని చుట్టుముట్టి ఏడాది పాటు ధర్నాలు చేసి ప్రభుత్వం దిగివచ్చేలా ఉద్యమం చేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ రైతాంగ వినాశనకర పాలన చేస్తున్నారని, వీరి దుర్మార్గపు పాలనపై వామపక్షాలు నిరంతర పోరాటం చేస్తున్నాయని, వీరి పాలన విముక్తి జరిగితేనే రైతాంగానికి మేలు జరుగుతుందని ప్రభాకర్ అన్నారు. వ్యవసాయరంగం నుంచి రూ.13 లక్షల కోట్లు రాబడి వస్తోందని, అందువల్లే ఈ రంగంపై ప్రభుత్వాలు మక్కువ చూపుతూ రైతాంగాన్ని అణచివేతకు గురిచేస్తున్నాయని విమర్శించారు. ఆక్వా రంగం నష్టాల బారినపడి కుదేలు అయిందని, రైతాంగానికి పెట్టుబడి కూడా రాని విధంగా రైతులు దివాళా తీశారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. సరైన సమయంలో ఆక్వా ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి రొయ్యల ధర తగ్గించి రైతుల్ని దెబ్బతీశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు, రైతు సంఘం నాయకుడు చెల్లుబోయిన కేశవ శెట్టి, అడపా నాగేశ్వరరావు, చెల్లుబోయిన తాతాజీ, చాలామంది సీపీఐ నాయకులు, ఆక్వా రైతు నాయకులు పాల్గొన్నారు.

చేతివృత్తుల కార్పొరేషన్‌కు

నిధులు కేటాయించండి

- జగన్ పాలనలో ఒరిగింది శూన్యం: రామాంజనేయులు
- 20న విజయవాడలో ధర్నా

విశాలాంధ్ర-నంద్యాల: చేతివృత్తుల కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలంటూ ఈ నెల 20న విజయవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని చేతివృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామాంజ నేయులు పిలుపునిచ్చారు. స్థానిక సాయిబాబానగర్ స్వామిరెడ్డి భవన్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి రాక ముందు రాజన్న రాజ్యాన్ని తెస్తానని, చేతివృత్తులు, కష్ట జీవుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఎన్నికల వాగ్దా నాలు గుప్పించిన జగన్, అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ చేతివృత్తిదారులకు ఒరిగిందేమీ లేదన్నారు. గతంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ ల ద్వారా సబ్సిడీలు పొందే చేతి వృత్తిదారులు నేడు ఎలాంటి లబ్ధిపొందడం లేదని అన్నారు. ఎంతో ఆర్భాటంగా 56 కులవృత్తులు, చేతివృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ నయా పైసా నిధులు కేటాయించకపోగా, కేవలం కార్పొరేషన్ చైర్మన్లు, పాలవర్గ సభ్యులకు జీతభత్యాలు, వాహన సౌక ర్యాలు కల్పిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నా రని ధ్వజమెత్తారు. చేతివృత్తిదారులకు మొండిచేయి చూపారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా సొంత పూచీకత్తుపై 50శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేయా లని డిమాండ్ చేశారు. చేతివృత్తిదారులను ఆదుకోని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిం చేందుకు సన్నద్ధమవుతున్నామని, రాష్ట్రంలో 26 జిల్లాలో ఉన్న చేతివృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డీ సుబ్బయ్య, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాండస్ బాధితులను ఆదుకోండి

సీఎస్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాండస్ తుపానుతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్ రెడ్డికి గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ రాశారు. పంట చేతి కందే సమయంలో కురిసిన భారీ వర్షాలతో లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిందని, 8 జిల్లాలు... అనంతపురం, కడప, అన్నమయ్య, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అనంత పురం జిల్లాలో వరి పంట, అపరాలు, కడప, అన్నమయ్య జిల్లాలలో అరటి, బొప్పాయి, అపరాలు, నెల్లూరులో వరి నార్లు, ప్రకాశంలో పొగాకు, పప్పు శనగ, మిరప, ధాన్యం, పత్తి, మినుము, గుంటూరులో వరి, మిరప, కృష్ణాలో వరి, అపరాల పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. పత్తి, మిరప, సెనగ, పొగాకు, మినుముతో పాటు ఉద్యాన పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లింది. వేసిన విత్తనాలు కుళ్లిపోవడం, మొలకెత్తినచోట మొక్కలు కొట్టుకుపోవడం, దెబ్బతినడం జరిగింది. కోతకొచ్చిన వరి పంట నీటమునగడంతో పాటు ఆరబెట్టిన ధాన్యం తడిసిందని తెలిపారు. ఈ తుపానుతో రైతులకు వేల కోట్ల నష్టం జరిగినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సరికాదని సూచించారు. రెక్కలు ముక్కలు చేసుకొని ఎన్నో ఆశలతో అరుగాలం శ్రమించి పండించిన పంటకు కనీస మద్దతు ధర కూడా చెల్లించడం లేదు. ధాన్యం సేకరణ లక్ష్యంలో భారీగా కోత విధించింది. ప్రభుత్వ ఆంక్షలు, కొత్త నిబంధనల కారణంగా పంటను సరైన ధరకు అమ్ముకునే పరిస్థితి లేక రైతులు నానా యాతన పడుతున్నారు. ఆర్బీకేలకు రైతులు ధాన్యాన్ని తీసుకువెళితే తేమ శాతం ఎక్కువ ఉందంటూ, ధాన్యం రంగు మారిందంటూ మద్దతు ధరల్లో పెద్ద ఎత్తున కోత పెడుతున్నారు. మరోవైపు గత ఏడాది జరిగిన ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటివరకు రైతులకు పూర్తిగా చెల్లింపులు జరగలేదు. ప్రభుత్వ చర్యలతో ప్రైవేటు వ్యాపారులు కుమ్మక్కై ధాన్యం మద్దతు ధరను తగ్గించి రైతులకు తీవ్ర నష్టం చేకూరుస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు పరిమితులు విధించి.. దళారులకు అమ్ముకోవాలని ప్రభుత్వమే సూచించడం సరికాదు. ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు క్వింటాకు రూ.500 నుంచి రూ.700 వరకు నష్టపోతున్నారు. ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇవన్నీ కూడా రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నాయి. వర్షాలకు తోడు వరి రైతులను గోనె సంచుల కొరత వేధిస్తోంది. ఆర్బీకేల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా దొరకని పరిస్థితి. ప్రభుత్వానికి గత ఏడాది ధాన్యం అమ్మిన రైతులకు నేటికీ చెల్లింపులు జరగలేదు. మూడున్నరేళ్లలో విపత్తుల కారణంగా రైతులు రూ.15 వేల కోట్లు నష్టపోయారు. రైతులను ఆదుకోవడా నికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రైతు రుణ భారంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. రైతు ఆత్మహత్యల్లో దేశంలోనే 3వ స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో వున్నది. సున్నా వడ్డీ 3 లక్షల పరిమితిని ఒక లక్షకే కుదించారు. ప్రభుత్వ చర్యలతో ఇప్పటికే ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు.

సిట్టింగ్‌లకు స్థానచలనం?

- పోటీచేసే అభ్యర్థులకే నియోజకవర్గాల బాధ్యత
- నేడు సీఎం క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నేతలతో భేటీ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు స్థానచలనం తప్పదని జోరుగా ప్రచారం జరుగుతోంది. పోటీ చేసే అభ్యర్థులకు ఇప్పటి నుంచే నియోజకవర్గాల బాధ్యత అప్పగిస్తారని విశ్వస నీయ వర్గాల సమాచారం. తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు నియోజకవర్గ సమన్వయకర్తలతో జరగనున్న భేటీ అందుకు ప్రాధాన్యత సంతరించుకుంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పుపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. విశాఖలో వైసీపీ కార్యకలాపాలు, పరిపాలన రాజధాని ఏర్పాటు తదితర అంశాలతో పాటు, రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని నియోజకవర్గాలపై చర్చించేందుకు తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆ జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, ముఖ్య నేతలతో సమావేశం జరగనున్నట్లు విశ్వాసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మరో 16 నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పుపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఇటీవల వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన ముత్తంశెట్టి శ్రీనివాసరావును తప్పించి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పార్టీ సమన్వయకర్తగా ఉన్న ఎంపీ విజయసాయిరెడ్డిని గత కొన్ని నెలలు క్రితం తప్పించి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి అప్పగించిన నేపథ్యంలో విశాఖ జిల్లాలో పార్టీ పరిస్థితిపై అధినేత జగన్ సుదీర్ఘంగా చర్చిస్తారని తెలుస్తోంది.

పాయకరావుపేట, ఎలమంచిలి, పెందుర్తి, గాజువాక, భీమిలీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి టికెట్ దక్కదని విస్తృతంగా ప్రచారం సాగుతోంది. విశాఖ జిల్లా అధ్యక్షుడుగా ఉన్న పంచకర్లకు ఎలమంచిలి లేదా పెందుర్తిలో టికెట్ లభించడం ఖాయమని వైసీపీ శ్రేణుల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా కొనసాగుతున్న గుడివాడ అమర్నాథ్‌కు ఈసారి నియోజకవర్గ మార్పు తప్పదని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అనకాపల్లి టికెట్ మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తనయుడు రత్నాకర్‌కు కేటాయిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. వైసీపీలోకి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చేరితే ఆయనకు విశాఖ ఎంపీ స్థానం, కుమారుడికి భీమిలి లేదా చోడవరం స్థానం అప్పగిస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. మంత్రి అమర్నాథ్‌కు గాజువాక, పెందుర్తి లేదా ఎలమంచిలి స్థానాల్లో ఎక్కడో ఒకచోట పోటీకి దింపాలని అధిష్టానం నిర్ణయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎమ్మెల్సీగా ఉన్న వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను గాజువాకలో పోటీకి దింపాలన్న ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇక నగర పరిధిలోకి వస్తే విశాఖ తూర్పు నుంచి ఈసారి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ) లేదా ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డిని పోటీలోకి దింపాలని అధిష్టానం యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కూడా పోటీ చేయాలని అధినేత జగన్ సూచించినట్లు తెలిసింది. అయితే విశాఖ తూర్పు నుంచి పోటీ చేసేందుకు ఆయన విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇక విశాఖ దక్షిణం నుంచి వాసుపల్లి గణేష్ కుమార్ లేదా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పోటీ పడుతున్నట్లు తెలిసింది. సుధాకర్‌ను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పంపించాలని ఇప్పటికే ప్రకటించినప్పటికీ ఆయన మాత్రం విశాఖ దక్షిణం నుంచే పోటీకి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. విశాఖ పశ్చిమ నుంచి విశాఖ డైరీ చైర్మన్ అడారి తులసి రావు తనయుడు వైస్ చైర్మన్ అడారి ఆనంద్‌కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విస్తృత ప్రచారం జరుగుతోంది. విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి మళ్లీ కేకే రాజుకే స్థానం కల్పిస్తున్నట్లు ఇటీవల నియోజకవర్గ సమీక్షలో స్వయంగా ముఖ్యమంత్రి జగన్ ప్రకటించడం తెలిసిందే.

21న బాపట్ల జిల్లాకు సీఎం జగన్

సభా ప్రాంగణ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి, కలెక్టర్

విశాలాంధ్ర-బాపట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 21న బాపట్ల జిల్లా పర్యటనకు వస్తున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. సీఎం కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు గురువారం సమాచారం అందడంతో సభా ప్రాంగణం ఏర్పాటుకు మంత్రితో కలిసి కలెక్టర్ విజయకృష్ణన్ అమర్తలూరు మండలం పెదపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. నాడు-నేడు కింద రూ.35.30 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేసినందున కొల్లూరులోనే ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించామన్నారు. అధికారికంగా సీఎం పర్యటన ఖరారు కావాల్సి ఉందన్నారు. విద్యార్థులు ట్యాబ్‌ల ద్వారా వినియోగించే బైజూస్ యాప్‌ను 21న ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభించనున్నారని మంత్రి చెప్పారు. కాగా, హెలిప్యాడ్ స్థలాన్ని మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రేపల్లె ఆర్డీవో పార్థసారథి, జిల్లా విద్యాశాఖ అధికారి పీ రామారావు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబ-తాత్వికతపై సభ రేపు

గుంటూరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్వర్యంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆత్మకూరి మొల్లమాంబ-తాత్వికత అంశంపై ఈ నెల 17వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటలకు గుంటూరులోని సీపీఎం కార్యాలయంలో సభ జరుగుతుంది. కవి, జర్నలిస్టు బి.విల్సన్ అధ్యక్షత వహించనున్న ఈ సభకు కవి ఎస్ఎం సుభానీ సభా పరిచయం చేస్తారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్, మొల్లమాంబ కళాపరిషత్ ఫౌండర్ చైర్మన్ గొల్లపల్లి లలిత్ ప్రజాపతి, విరసం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఆత్మీయ అతిథులుగా తెలుగు పండితులు మోదుగుల సుబ్బారావు, రాష్ట్ర ప్రభుత్వ టిడ్కో డైరెక్టర్ కానూరి నాగేశ్వరి, మదర్ థెరిస్సా బహుజన సేవా సంస్థ అధ్యక్షులు వేమవరపు వరలక్ష్మి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, సామాజిక న్యాయవాది పలుకూరి ప్రసాద్, మాల మహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బత్తుల అనిల్‌బాబు, ప్రముఖ న్యాయవాది నారదాసు వీర మరేంద్ర, సామాజిక కార్యకర్తలు తొర్లికొండ సీతామహాలక్ష్మి, తనకవల్లి వినయ్ బాబు హాజరు కానున్నారు. సభను లిటరేచర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు బి.శ్యాంబాబు, కడియం జేమ్స్ నిర్వహిస్తారు.

నన్నూరులో తోడికోడళ్ల హత్య

పోలీసుల అదుపులో నిందితులు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: జిల్లాలోని ఓర్వకల్లు మండలం నన్నూరులో తోడికోడళ్ల హత్యలు సంచలనంగా మారాయి. తమ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం పొలం పనులు వెళ్లిన గోగన్న కోడళు రామేశ్వరమ్మ, రేణుక హత్యకు గురయ్యారు. గోగన్నకు ఇద్దరు కుమారులు... పెద్ద గోవిందు, చిన్న గోవిందు. పెద్ద గోవిందుకు ఏడేళ్ల క్రితం మిడుతూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన రామేశ్వరితో వివాహం జరిగింది. చిన్న గోవిందు కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేనత్త కుమార్తె రేణుకను ఇష్టపడి రెండు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ప్రతిరోజూ మాదిరే బుధవారం పొలం పనులకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వారిని వెతకడానికి వెళ్లగా... రక్తపు మడుగులో మృతి చెందినట్లు గుర్తించారు. తోడికోడళ్లిద్దరూ హత్యకు గురికావడంతో గ్రామస్తులు భయాందోళకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్ ద్వారా నిందితులను పట్టుకునే ప్రయత్నం చేశారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మామ, భర్తలే హత్య చేశారు: బంధువులు

తమ పిల్లలను మామ గోగన్న, భర్తలు పెద్ద గోవిందు, చిన్నగోవిందులే హత్య చేశారని బంధువులు ఆరోపించారు. పిల్లలు లేరనే హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. వీరికి 30 ఎకరాల ఖరీదైన పొలం ఉంది. ఇంత ఆస్తి ఉండి కూడా పిల్లలు లేరని ఇంతటి దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇదిలా ఉండగా, నిందితులు గోగన్న, పెద్ద గోవిందు, చిన్న గోవిందులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

నిందితులను ఉరితీయాలి: మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

పాశవికంగా ఇద్దరు మహిళలను హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. వైద్యశాలలో మృతదేహాలను పరిశీలించి మృతుల బంధువులను పరామర్శించారు. ఇంత కిరాతకంగా హత్య చేయడం దుర్మార్గమన్నారు. నిందితులు ఏమి తెలియనట్లుగా గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో చంపినట్టు నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్ యాదవ్ ఉన్నారు.

'నీట్' సూపర్ స్పెషాలిటీలో డాక్టర్ నరేన్‌కు ఆల్ ఇండియా రెండో ర్యాంకు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: డాక్టర్ పోలవరపు నరేన్ నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో (న్యూరాలజీ విభాగం) ఆల్ ఇండియా రెండో ర్యాంక్ సాధించారు. ఆయన గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి అనేక బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. హౌస్ సర్జన్ చేస్తూ నీట్ పీజీ ఎంట్రన్స్‌లో కూడా మంచి ర్యాంకు పొంది జనరల్ మెడిసిన్ విభాగంలో సీటు పొందారు. డాక్టర్ నరేన్ మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. తల్లిదండ్రులు డాక్టర్ రాఘవశర్మ, డాక్టర్ పి.విజయ, గురువు డాక్టర్ సుందరాచారి తనకు ఆదర్శమని తెలిపారు.

సంపాదకీయం

వందరోజుల భారత్ జోడో యాత్ర

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి ప్రారంభించిన భారత్ జోడో యాత్ర నేటికి 100 రోజులు పూర్తి అయింది. 150 రోజుల్లో 3,500 కిలోమీటర్లు సాగవలసిన ఈ యాత్ర కశ్మీర్‌లో ముగియాల్సి ఉంది. గత మూడు నెలల నుంచి ఈ యాత్రకు ఊహించిన దానికన్నా ఎక్కువ స్పందనే కనిపిస్తోంది. యాత్ర పొడవునా రాహుల్‌తో పాటు కలిసి అడుగేస్తున్న వారి సంఖ్య తక్కువే కావచ్చు. సుదీర్ఘమైన ఏ యాత్రలో అయినా ఇదే పద్ధతి ఉంటుంది. కానీ ఎక్కడికక్కడ వేలు, లక్షల మంది రాహుల్ ప్రారంభించిన యాత్రలో భాగస్వాములు అవుతున్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ యాత్రలో భాగస్వాములు కావడంలో ఆశ్చర్యం లేదు. నిద్రాణస్థితిలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తల్లో ఈ యాత్ర నూతనోత్సాహం కలిగించింది. కాంగ్రెస్ ఏదైనా సాధించగలదన్న నమ్మకం కార్యకర్తలకు కుదిరినట్టు కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు ఎన్నిఉన్నా పరస్పరం కలహించుకునే నాయకులు కూడా ఎక్కడో ఒక చోట రాహుల్‌గాంధీ పాదయాత్రలో పాల్గొన్నారు. అనేక ప్రతిపక్షపార్టీల నాయకులు కూడా ఈ యాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. యోగేంద్ర యాదవ్ లాంటి సామాజిక ఉద్యమకారులు, సామాజిక ఉద్యమాలతో సంబంధం ఉన్న అనేక స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు కూడా రాహుల్‌తో కలిపి అడుగేస్తున్నారు. వివిధ రంగాలకు చెందిన అనేకమంది ప్రముఖులు కూడా రాహుల్ భారత్ జోడో యాత్రతో మమేకం అయ్యారు. వీరెవరూ ఎప్పుడూ కాంగ్రెస్ వారు కారు. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్, నర్మదా బచావో ఆందోళనవల్ల ప్రసిద్ధురాలైన పట్టు విడువని పర్యావరణ కార్యకర్త మేధా పాట్కర్ లాంటి వారు రాహుల్ యాత్రలో భాగస్వామ్యులు కావడం అంటే ఆ యాత్రలో ఎంతో కొంత సారం ఉందనే అనుకోవాలి. సినీ నటి స్వరా భాస్కర్, సామాజిక కార్యకర్త హర్ష్ మందర్, మహాత్మా గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ, హిందీ సినీ నటులు, సినిమా రచయితలు, రంగస్థల నటులు, సినిమా డైరెక్టర్లు, కవులు ఈ యాత్రలో భాగస్వాములయ్యారు. ప్రతిపక్షపార్టీ నేతల్లో ప్రముఖులు, పార్లమెంటులో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ సభ్యురాలు సుప్రియా సూలే, శివసేన అగ్రనాయకుడు ఆదిత్య ఠాక్రే, సామాజిక కార్యకర్త, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ లాంటి వారు కూడా భారత్ జోడో యాత్రలో భాగస్వాములయ్యారు. మొన్నటిదాకా ఎందుకూ కొరగాడనుకున్న రాహుల్ గాంధీకి విభిన్న వర్గాలకు, వృత్తులకు, రంగాలకు, రాజకీయ పార్టీలకు చెందిన వారు సంఘీభావం తెలియజేయడానికి బలమైన కారణం ఏదో ఒకటి లేకుండా ఉండదు. శివసేన నాయకుడు అధినేత, పార్లమెంటులో నేషనలిస్టు కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా సూలే కూడా రాహుల్ ప్రయత్నానికి అండగా నిలిచారు. ఈ యాత్ర ఇప్పటిదాకా తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్ ద్వారా సాగింది. ఇందులో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రం ఒక్కటీ లేకపోయినా భారత్ జోడో యాత్రకు విశేషమైన స్పందన లభించింది. ప్రస్తుతం ఈ యాత్ర కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో సాగుతోంది. బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో కూడా రాహుల్‌కు విశేష ఆదరణ లభించడం సులువుగా కొట్టిపారేయదగిన అంశం ఏమీ కాదు. రాజస్థాన్‌లోని ఆల్వార్‌లో డిసెంబర్ 19న భారీ బహిరంగసభ నిర్వహించాలనుకుంటున్నారు. ఫిబ్రవరి 23వ తేదీన శ్రీనగర్‌లో ముగుస్తుంది.

వంద రోజులు ఈ యాత్ర సాగడం కుదేలైపోయి ఉన్న కాంగ్రెస్ దృష్టితో చూస్తే ఓ మైలురాయి అనుకోవాలి. రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి వచ్చి చాలాకాలం అయినా ఆయన పూర్తి కాలం రాజకీయ నాయకుడు కాదని, తరచుగా విదేశాలకు విహార యాత్రలకు వెళ్తుంటాడని, ఒక్కోసారి దేశంలోనే ఉన్నా ఎవరికీ కనిపించకుండా అజ్ఞాతంలో ఉన్నట్టు ఉండిపోతారన్న విమర్శలు విస్తారంగానే ఉన్నాయి. మంగళవారం దాదాపు 30 సంస్థలకు ప్రాతినిధ్యం వహించే దళిత కార్యకర్తలు రాహుల్ ను కలుసుకున్నారు. సోమవారం అనేక మహిళా సంఘాలవారు రాహుల్‌తో చర్చించారు. ఈ యాత్రకు అనూహ్యమైన స్పందన రావడం మోదీ ప్రభుత్వాన్ని కలవర పెడ్తోంది. బింకానికి పోయి చాలా మంది బీజేపీ నాయకులు ఈ యాత్రను, రాహుల్‌గాంధీని చులకనచేస్తూ మాట్లాడుతున్నప్పటికీ వారి గుండెల్లో రైళ్లు పరుగెట్టడం స్పష్టంగానే కనిపిస్తోంది. యాత్ర పొడవునా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అసత్య ప్రచార బండారం బట్ట బయలు అవుతూనే ఉంది. అనేక జీవన రంగాలకు చెందిన వారు భారత్ జోడో యాత్రలో భాగస్వాములు కావడం మోదీ ప్రభుత్వంపై పెరుగుతున్న విముఖతకు తార్కాణంగా కనిపిస్తోంది. ఈ యాత్రను ఎన్నికల్లో విజయం సాధించడానికి గానీ, తక్షణ రాజకీయ ప్రయోజనాలు పొందడానికి రూపొందించలేదు. ఈ యాత్ర ఇటీవల శాసనసభ ఎన్నికలు జరిగిన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి సాగకపోవడమే ఇది ఎన్నికల లబ్ధికి అతీతమైన యాత్ర అని స్పష్టం అవుతోంది. ఈ యాత్ర ప్రభావమే లేకపోతే మోదీ నాలుగు దక్షిణాది రాష్ట్రాలలో పర్యటించి ఉండరు. శుక్రవారం నుంచి కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో రాష్ట్రస్థాయి కాంగ్రెస్ యాత్రలు ప్రారంభమయ్యాయి. భారత్‌జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీకి ఎక్కడ ఎంత మంది మద్దతు తెలిపారన్నది ప్రధానం కాదు. ఎందుకంటే యాత్ర సందర్భంగా బ్రహ్మాండమైన ర్యాలీలు నిర్వహించనే లేదు. జనాన్ని తరలించిన ఆనవాళ్లు లేవు. అనునిత్యం ప్రముఖులే కాక సామాన్యులు కూడా రాహుల్‌ను కలుసుకుంటూనే ఉన్నారు. ఆయన వారి సమస్యలను శ్రద్ధగా వింటున్నారు. సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నారు. దక్షిణాది కొస నుంచి ఉత్తరాన చివరి వరకు సాగుతున్న ఈ యాత్రకు మంచి స్పందన వస్తున్నందువల్ల దేశం తూర్పు నుంచి పడమరకు కూడా ఇలాంటి యాత్ర నిర్వహిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలు కాగ్రెస్ వర్గాలలో సాగుతున్నాయి. ఈ యాత్రవల్ల కాంగ్రెస్ మీద ప్రజలకు ఉన్న అభిప్రాయం సమూలంగా మారిపోయినట్టు కనిపిస్తోంది. వివిధ ప్రాంతాలలో రాహుల్‌కు ఆదరణ ఎంతగా కనిపించినా ఆ స్పందనను కాంగ్రెస్ ను సంస్థాగతంగా పటిష్ఠం చేయడంలో కాంగ్రెస్ ఎంత మేరకు సఫలమవుతుందన్నది పెద్ద ప్రశ్నే. పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతు నొక్కడమే అధికార పక్షం పనిగా పెట్టుకున్నందువల్ల కాంగ్రెస్ అగ్రనాయకుడు నేరుగా ప్రజలను సంప్రదించే అవకాశం వచ్చింది. ఈ నెల 28వ తేదీన అసోం, ఒడిశా, త్రిపురలో ఆ రాష్ట్రాలకే పరిమితమైన యాత్రలను కాంగ్రెస్ నిర్వహించాలని సంకల్పించింది. పశ్చిమ బెంగాల్, బిహార్‌లో కూడా ఈ యాత్రలు జరగొచ్చు.

అక్షరానికి ఉరి

రా బావ ఏంటి ఆలోచిస్తూ వస్తున్నావు. పార్వతి మీ అన్నయ్య వచ్చాడు కాఫీ పట్టుకురా. ఇపుడు చెప్పు బావ నీ ఆలోచనకు కారణ మేమిటో. ఆ ఏంలేదు బావ చివరకు అక్షరం కూడ రాజకీయ నాయకుల చేతిలో నలిగిపోతోందిగదా అని ఆలోచిస్తున్నాను. నలగడం కాదు బావ ఉరి తీయబడుతోంది అంటే సబబుగా ఉంటుంది. నిజానికి అక్షరం ఆయుధం కంటె గొప్పది గద మరి ఈ గతి ఏమిటి బావ. నిజమె బావ అక్షరం కోట్ల మందిని చైతన్యపరుస్తుంది. ప్రభుత్వాలను సైతం పడగొట్టి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. అక్షరాన్ని నొక్కి పట్టిన కొద్ది ఎగిసిపడుతూనే ఉంటుంది. ఒక దుర్మార్గుడిని కొట్టవచ్చు, చంపవచ్చు. ఉరి తీయవచ్చు గాని అక్షరాన్ని ఉరి తీయగలవారు లేడనుకున్నాం గాని ప్రస్తుతం అక్షరాన్ని నిలువునా పాతిపెట్టి ఉరి తీయగల్గిన రాజకీయులు ప్రస్తుతం కనబడుతున్నారు బావ. అదేంటి బావ అలా అంటావు. రవి కాంచని చోట కవి గాంచగలడంటారు. కవి మస్తిష్కం నుండి వచ్చి అక్షరం సుడిగాలిలో నియంతలు కొట్టుకుపోక తప్పదని, అక్షర సైన్యం ముందు తుపాకులు పనిచేయవంటారు. నిజమె బావ గతంలో రాజులను దించి ప్రజలకు అందించింది ఆంగ్లేయులు తరిమిగొట్టింది అక్షరమే. ప్రజల కడగండ్లను చూసిన రచయిత మనసు చూస్తూ ఊరుకోదు. అక్షరానికి, మనసుకు చావుండదు బావ. మనసు స్పందించి కలంపడితే స్వార్థపరుల పునాదులు కూలిపోక తప్పదు బావ.

ఆయుధసంపత్తి గల ఆంగ్లేయులను తరిమికొట్టడానికి ప్రజల్లో చైతన్యం తెచ్చిన అక్షరం చాలా గొప్పది బావ. అది నిజమె బావ అదంతా గత వైభవం. ప్రస్తుతం రాజకీయ మాయాజాలంలో అక్షరం కూడ

వంకరపోయి నలిగి చివరకు తాకట్టుగా మారిపోయింది. అది ప్రస్తుత దురవస్థ. ప్రస్తుతం గద్దెనెక్కిన వారిని దించి మరొకరిని గద్దెనెక్కించడానికి తాపత్రయపడేవారి చేతిలో అక్షరం బందీగా మారింది బావ. అధికార దాహంతో కొందరికి అనుచరులుగా మారి తమకున్న పత్రికలను వారికి తాకట్టుపెట్టి అక్షరాన్ని ఉరి తీస్తున్నారు బావ. నిజమె బావ సమాజానికి మార్గదర్శిగా ఉండవలసిన పెన్ను పాళి వంకరపోయి అక్షరాన్ని అమ్ముకుని సమాజాన్ని తిరోగమనంలోకి నెట్టి ఆంగ్లేయుల పాలనే మెరుగనిపించే టట్లుగా కొన్ని పత్రికలు పనిచేయడం శోచనీయం బావ. నిజమె మనసుకు స్వేచ్ఛ ముఖ్యం. అలా కాక అక్షరాన్ని అమ్ముకోవడం భావ స్వాతంత్ర్యం కోల్పోవడం బానిస బతుకె బావ. ఆంగ్లేయుల పాలనలో బానిస బతుకు బతికామని చెప్పేవారు. ప్రస్తుతం నియంతలుగా మారి ప్రజల్ని బానిసలుగా మారుస్తున్నారనడంలో సందేహం లేదు బావ. నిజమె బావ త్రిపురనేని గోపీచంద్ లాంటి గొప్ప రచయిత ఏమిటి, ఎందుకు అన్న ప్రశ్నలు నేర్పిన తండ్రికి తన పుస్తకం అంకితమిచ్చాడు బావ. ప్రశ్నించకపోతె నిజం బయటపడదు. కాని ప్రశ్నించిన మనిషి జైల్లో ఊచలు లెక్కపెట్టే వ్యవస్థ ప్రస్తుతం ఉండటంతో రచయితలు కూడ అమ్ముడుపోవడం లేకపోతే పెన్ను క్యాప్ ముడిచి యింటికి పరిమితమవుతున్నారు బావ. నిజమె. గతంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు వార్తలు ప్రభుత్వానికి పంపితే వారు వారికి అనుకూలమైనవే పబ్లిష్ చేయడానికి పంపేవారు. ఆనాడు కూడ అక్షరం స్వతంత్రం కోల్పోయింది బావ.

ప్రస్తుతం రాజకీయాలు ప్రభుత్వాలను దించి తామెక్కే విధానాలు అనుసరిస్తున్నాయి. మారవలసింది ప్రభుత్వం కాదని వ్యవస్థ మారాలని అక్షరం కోరుతోంది. వ్యవస్థలో ఒక భాగం మాత్రమే రాజకీయం అని నాయకులు గుర్తించాలి బావ. పాలించడానికి ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని అవసరమయితే దించే హక్కు ప్రజలకు ఉండాలి బావ. నిజమె బావ ప్రజల అవసరాలు తీర్చకుండా వారి స్వార్థం కోసం పనిచేసే ప్రభుత్వాన్ని రీకాల్ చేసే హక్కు ప్రజలకుండాలని అక్షరం గొంతెత్తి అరుస్తూనే ఉంది బావ. నిజమె బావ ఇవన్నీ సాధ్యం కావాలంటె మనిషి మనసు వికసించాలి. మూఢ నమ్మకాలతో గూడుకట్టుకున్న మనిషి ముందు వాటి నుంచి బయట పడాలి. మనసు వికసించాలి. అందుకు అక్షరం పూనుకోవాలి బావ. ఒక నాయకుడో, ఒక వేదాంతో చెప్పిందే వేదంగా భావించకుండా మంచి చెడులను తూచి మంచి వైపు అడుగేయడానికి అక్షరం పూనుకోవాలి బావ. ఎవరోఒకరిని అనుసరించకుండ స్వతంత్రంగా ఆలోచించే విధంగా మనిషిని అక్షరం తీర్చిదిద్దాలి. మత, కులాల మత్తులో మనిషిని ముంచి తమ పబ్బం గడుపుకునే రాజకీయాల నుండి మనిషి బయటపడాలి. అందుకు అరచేయి అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేనివిధంగా అక్షర పొదిలో ఉండి అక్షర ఆయుధాన్ని రచయితలు బయటకుతీయాలి. మనిషిని మతానికి బానిసగా మారుస్తున్న వ్యవస్థపై పోరాటానికి రచయితలు అక్షరాన్ని సంధించాలి. సమాజహితులైన కొందరు రచయితలను మతం బలి తీసుకుంటోంది. 83 శాతం ప్రజల వద్ద సెల్‌ఫోను ఉంది గాని ఒక శాతం చేతిలో పుస్తకం కనబడటంలేదు. ధనానికి యితర ప్రలోభాలకు లొంగకుండ రచయిత వ్యవస్థను మార్చాలి. అప్పుడు స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలకవచ్చు. అది అక్షరం వల్లె సాధ్యం బావ. పార్టీలకోసం కాక సర్వజనుల క్షేమం కోసం వ్యవస్థను మార్చడం కోసం అక్షరాన్ని ఉపయోగించాలి. ఓ అక్షరమా కొందరు రచయితలు కొందరి స్వార్థ పరులకు నిన్ను అమ్మేస్తున్నారు జాగ్రత్త తల్లీ అని బాధపడవలసిందె బావ.

సెల్: 9885569394

మార్కెట్ పార్టీ గెలుపు రహస్యం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

అసంతృప్తి మానవ సహజ లక్షణం. ప్రజాస్వామ్యంలో అసంతృప్తి అంతర్లీన అధికార వ్యతిరేకతను నిర్వచిస్తుంది. ఎన్నికల్లో ఓటర్ల రక్తరహిత తిరుగుబాటుకు దారితీస్తుంది. ఈ ఏటి గుజరాత్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఈ ప్రజాస్వామ్య తర్కాన్ని తిరస్కరించింది. విద్య, ఆరోగ్యం, పేదరికం వగైరా మానవాభివృద్ధి సూచీలలో గుజరాత్ బాగా వెనుకబడింది. రైతుల, వ్యవసాయ కార్మికుల, గ్రామీణ ప్రజల అసంతృప్తి, నిత్యావసర వస్తుసేవల ధరలు, వర్గవ్యత్యాసాలు, కులమతతెగల ద్వేషాలు పెరిగాయి. పేదల ఆదాయం తగ్గింది. బీజేపీ మార్కెట్ పార్టీగా మారింది. ప్రజాప్రాతినిధ్యం చిన్న సంతలను చిదిమేసింది. వాణిజ్యవేత్తలను ప్రోత్సహించింది. సంపన్నులే సంపద సృష్టికర్తలని, ఉపాధి బ్రహ్మలని ప్రధాని ప్రవచించారు. కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో లాగా భూసంస్కరణలు జరగలేదు. విద్య, వైద్యాల్లో విలువలు పెరగలేదు. మతాధార పక్షపాతాలు చోటుచేసుకున్నాయి. పెద్దనోట్ల ప్రవేశం గుజరాత్ అవినీతిని పెంచింది. ఆశ్రిత పక్షపాతంతో ప్రపంచస్థాయి సంపన్నులు తయారయ్యారు. అభివృద్ధి చెందుతున్న సమాజాల అధ్యయన కేంద్రం, లోకనీతి జరిపిన ఎన్నికల ముందు సర్వేలో గజరాత్‌లో అవినీతి మితిమీరిందని, ధరలు, నిరుద్యోగం పెరిగాయని 70శాతం గుజరాతి ఓటర్లు చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల మాదిరిగానే గుజరాత్ బీజేపీలో ముఠాతత్వం పెరిగింది. బతికిన రోజుల్లో కాంగ్రెస్ ముఠాతత్వంలాగే ఈ రోజు బీజేపీలో ముఠాతత్వం వ్యవస్థాపితమైంది. నిజానికి మోదీయే పెద్ద ముఠానాయకుడు. హిమాచల్ పాలనాధికారలోపాలు గుజరాత్‌లోనూ ఉన్నాయి. హిమాచల్ బీజేపీ మతోన్మాద రాజకీయాలను ఎదుర్కోడానికి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), కాంగ్రెస్ వైదికవిధానాలనే ఎంచుకున్నారు. ఆప్ వల్ల కాంగ్రెస్ 33 స్థానాలు కోల్పోయింది. గుజరాత్‌లో కాంగ్రెస్ స్పష్టమైన ఎన్నికల సందేశాన్ని ప్రచారం చేయలేదు. అప్రజా స్వామికమైన మోదీని ఎదుర్కోడానికి సమర్థుడైన ముఖ్యమంత్రిని సూచించలేదు. ఎన్నికల్లో గంభీరంగా పనిచేయలేదు. పాటిదార్ల ప్రముఖ నాయకుడు ఖోదాల్దాం ట్రస్ట్ ఛైర్మన్ నరేశ్ పటేల్ కాంగ్రెస్‌తో కలిపి పనిచేస్తానని దిల్లీలో రాహుల్‌ను కలిసినా గాంధీ ఆయన్ను పట్టించుకోలేదు. తర్వాత పటేల్ మోదీకి ఫోన్ చెయ్యగానే ఆయన పాటిదార్లను కలుపుకున్నారు. ఎం.ఐ.ఎం. కాంగ్రెస్‌ను విమర్శించింది. బీజేపీ జోలికి పోలేదు. బీజేపీ వైదికమే శ్రేష్టమైందిగా భావించే దుస్థితికి ప్రజలు నెట్టబడ్డారు. భౌతిక ప్రయోజనాల కంటే భావజాల ఉద్రేకతలతో ప్రభావితమయ్యారు. వాగాడంబర వక్రీకరణలనే సత్రమాలని నమ్మారు. సమస్యల పరిష్కార ఆలోచనల నుండి దూరం జరిగారు. కొత్త "దేవత" కంటే పాత దయ్యం మేలనుకున్నారు.

దయ్యాన్ని అసహ్యించుకునేవారు విడిపోయారు. బలహీనపడ్డారు.

మోదీ సర్కార్ కొన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం) లలో 19లక్షల ఈవీఎంలు గల్లంతయ్యాయి. ఈ సమాచారం తన వద్ద లేదని సమాచార హక్కు ప్రశ్నకు ఎన్నికల సంఘం జవాబిచ్చింది. ఈవీఎంల గల్లంతును కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ 30.3.2022 న ప్రస్తావించారు. కర్ణాటక శాసనసభ కాంగ్రెస్ సభ్యుడు హెచ్ కె పాటిల్ గల్లంతైన 19లక్షల ఈవీఎంల సంగతి తేల్చమని 8.5.2022 న కర్ణాటక స్పీకర్‌ను కోరారు. ఇవి గాక మరో 5లక్షల ఈవీఎంల ఆచూకీ లేదు. వీటన్నిటిని దుర్వినియోగపరుస్తున్నారని అనుమానం. గుజరాత్ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల తర్వాత 12/13 శాతం ఓట్లు నమోదయ్యాయి. 20/25 నియోజకవర్గాలలో 31వేల ఓట్లకు పైగా పోలయ్యాయి. వడోదర నియోజకవర్గంలో 35,700 ఓట్లు, అకోటాలో 28,873 ఓట్లు పోలయ్యాయి. ఇంతటి వేగవంతమైన ఓటింగ్ బలవంతమా? సహజమా? మూడుసార్లు గుజరాత్ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న మాధవ్ సింఘ్ సోలంకి 1985లో 149 సీట్లు తెచ్చారు. ఈ రికార్డును బద్దలు కొట్టాలని మోదీ చిరకాల కోరిక. దాన్ని నెరవేర్చుకోడానికే కుంభకోణాలకు పాల్పడ్డారు. ఫలితమే 156 సీట్లు. సిసిటివి వీడియోలను ఇమ్మని ప్రతిపక్షాలు ఎన్నికల సంఘాన్ని కోరాయి. ఇసి ఈ వీడియోలను ఇస్తుందా? అక్రమ పద్ధతుల్లో నియమించబడిన కమిషనర్లు, మోదీ సర్కారుకు లొంగి పనిచేసే ఎన్నికలసంఘం విధులను సరిగా నిర్వహిస్తుందా? ఎన్నికల సంఘం ధృతరాష్ట్ర పాత్ర పోషించిందని పలువురు గుజరాతీయులు అన్నారు. ఇది గుజరాత్ కొత్త ప్రయోగం. ఎన్నికల సంఘం అనుసరించిన మోదీ ప్రభుత్వ ప్రాయోజిత పథకం. గుజరాత్ ఎన్నికలను మోదీ ప్రతిష్టాత్మకంగా పరిగణించారు. మోదీ గుజరాత్ నమూనాను ఊదరగొట్టి 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నియమితులయ్యారు. ఆ బూచినే ప్రచారంచేసి ప్రధాని అయ్యారు. గుజరాత్‌లో ఓడితే గుజరాత్ నమూనా మోసమని, మోదీ అబద్దాలకోరని తేలుతుంది. పోలింగ్ తర్వాత పార్టీల ప్రతినిధులందరూ వెళ్ళగానే బూత్‌లలో వినియోగించిన ఈవీఎంల స్థానంలో తాము ఓట్లేసిన కొత్త ఈవీఎంలను ఉంచారని, ఇవి 20/30శాతం ఉండచ్చని అనధికార సమాచారం. సాయంత్రం 5గంటలతర్వాత పోలింగ్‌బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్ జరిగాయని ఆరోపణలున్నాయి. ఓట్లలెక్కింపు సమయంలో ఈవీఎంల గుర్తింపు సంఖ్యలను ధృవీకరించలేదు. ఈవీఎంలో ఒక ఓటు నమోదుకు 12 సెకన్లు పడుతుంది. గుజరాత్ ఎన్నికల్లో చివరి గంటలో సగటున 3 సెకన్లకు ఒక ఓటు నమోదయింది. ఇలా పోలయిన ఓట్లే పలువురు బీజేపీ అభ్యర్థుల విజయానికి కారణం. ఎన్నికల ఫలితాలరోజు ఉదయం పదిగంటలకే 53 శాతం ఓట్లతో బీజేపీ ఆధిక్యతలోఉందని ఎన్నికల సంఘం ప్రకటించింది. 2శాతం ఈవీఎంలలో/నియోజకవర్గంలో 5 కేంద్రాల్లో పోలైన ఓట్ల సంఖ్యను ఈవీఎం ధృవీకరణ పత్రాలతో (వివిపాట్) సరిపోల్చాలి. తర్వాతే ఫలితాలు ప్రకటించాలి. ఇలా జరిగిందో లేదో తెలియదు. నెట్‌ఇండియా ప్రై.లి.కు చెందిన వేమూరి హరిప్రసాద్ బృందం ఓటింగ్ ముందు ఈవీఎంల హార్డ్‌వేర్‌ను మార్చవచ్చని, దీంతో ఎన్నికల ఫలితాలు తారుమారవుతాయని నిరూపించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఇలా నిర్ణయించింది: ఎన్నికల ముందు రోజు అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో అన్ని పార్టీలకు నమూనా ఓట్లు వేసి వాటిని వివిపాట్‌తో సరిపోల్చాలి. ఈవీఎం తారుమారుకు గురికాలేదని, ముందుగా ఏ పార్టీకి రహస్యఓట్లు నమోదుకాలేదని ధృవీకరించాలి. ఏ అనుమానమున్నా ఈవీఎంను మార్చాలి. ఈవీఎంలు తారుమారుకు అతీతులు కావని ఆర్.ఎస్.ఎస్. నేత సుబ్రమణియన్ స్వామి రిట్‌పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు 17.01.2012న తీర్పుచెప్పింది. ఈవీఎంల నిపుణుడు సయ్యద్ షుజా ఈవీఎంలను చిన్నాభిన్నం (హ్యాక్) చేయచ్చని, ప్రధాని మోదీ, బీజేపీ కేంద్ర ప్రభుత్వం రిలయన్స్ కమ్యూనికేషన్స్ సాయంతో ఈవీఎంలను తారుమారు చేసిందని జనవరి 2019లో ఆరోపించారు. లండన్‌లో పత్రికా సమావేశంలో వీడియో సమావేశం ద్వారా ఈవీఎంలను హ్యాక్‌చేసి చూపించారు. ఈవీఎంల హ్యాక్ విషయాన్ని బయటపెడతారన్న భయంతోనే పూర్వ కేంద్రమంత్రి గోపీనాథ్ ముండేను జూన్ 2014లో హత్యచేశారని ఆరోపించారు. ముండే బతికుంటే మోదీ బండారం అప్పుడే బయటపడేది. భవిష్యత్తు ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఏకం కావాలి. ప్రజాస్వామ్య విలువలతో ముక్తభారత్‌ను సాధించాలి. కుతంత్రాలు, మోసాలతో మోదీ సంపాదించగల ఓట్లను మించి ఓట్లు సంపాదించటానికి పథకాలు రచించాలి.

-ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

హద్దులు దాటరాదు

ఇ-మెయిల్

చైనా తన హద్దు దాటింది. భారత్‌లో రాజకీయాలు కూడా హద్దు దాటుతున్నాయి. సరిహద్దు ప్రాంతంలో చైనా అతిక్రమణలు తరచుగా జరగడం ఒక గంభీరమైన విషయం. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశం. ఈ అంశంపై దేశమంతా ఒకే గళంగా ఉండాలి. అయితే అదే అంశంపై చర్చించడానికి పార్లమెంట్ లో ఏకాభిప్రాయం కొరవడడం బాధాకరం. డిసెంబర్ 9న చైనా,భారత్ సరిహద్దులో తవాంగ్ ప్రాంతంలో వందలాది చైనా దేశపు సైనికులు నిబంధనల్ని అతిక్రమించి భారత్ భూభాగంలోకి చొచ్చుకు రావడంతో ఘర్షణ నెలకొంది. ఇరువైపులా పదుల సంఖ్యలో గాయపడ్డారు. 2020లో గల్వాన్‌లో ఇదే తరహా ఘటనలో సైనికులు మరణించారు. ఈసారి అంతవరకూ వెళ్ళకుండానే సమస్య పరిష్కరించడం సైనిక, దౌత్య విజయం. ఈ విషయాన్ని రక్షణశాఖ మంత్రి దేశానికి తెలియజేశారు. ప్రభుత్వం స్పందించిన తీరు అభినందనీయం. అయితే పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున చర్చ జరిగితే బాగుండేది. చర్చ జరిగే వాతావరణం అధికార పక్షం కల్పించలేదు. ఈ అంశం రాజకీయరూపాన్ని సంతరించుకుంది. ఇది క్షేమదాయకం కాదు. బహిర్గతం చెయ్యకూడని విషయాలు వదిలి, మిగతావాటిని లోతుగా చర్చించి పార్లమెంట్ ద్వారా ఒకే గొంతు బలంగా వినిపించాల్సిన తరుణం. దేశ సరిహద్దులో భారత్, అమెరికా సంయుక్త సైనిక ప్రదర్శనలపై చైనా గుర్రుగా ఉంది. భారత్ జీ20 కూటమికి, ఐక్యరాజ్యసమితి సెక్యూరిటీ కౌన్సిల్‌కీ నాయకత్వం వహిస్తున్న తరుణంలో ఇలా గిల్లికజ్జాలకు తలపెడుతుంది. మన దేశం దౌత్య, రాజకీయ మార్గాల్లో పరిష్కార మార్గాన్ని వెదకాలి. అంతర్జాతీయ వ్యవహారాల్ని దేశీయ రాజకీయాలకు అతీతంగా ఉంచాలి.

- డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ,
94408 36931

ప్రతిపక్షాల ఐక్యత కొనసాగాలి

టి.వి.సుబ్బయ్య

శీతాకాలపు పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. నరేంద్ర మోదీ నాయకత్వంలో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం ఏనాడూ సభలో ముఖ్యమైన అంశాలపై చర్చలు జరపడం లేదన్నది వాస్తవం. దేశంలో కొన్ని పదులకోట్ల రైతులకు సంబంధించిన మూడు వ్యవసాయ చట్టాలు, అలాగే మరికొన్ని కోట్ల కార్మికుల జీవితాలకు సంబంధించిన కార్మిక కోడ్లపైనగానీ పెద్దగా చర్చించలేదు. తాజాగా అరుణాచలప్రదేశ్‌లో తవాంగ్ సరిహద్దు ప్రాంతంలో చైనా సైన్యం దేశంలోకి ప్రవేశించారన్న అంశంపై లోక్‌సభలో బుధవారం వివరంగా చర్చించడానికి ప్రభుత్వ అంగీకరించలేదు. లడాక్‌లో తీవ్ర ఘర్షణ వాతావరణం, సైనిక చర్యలప్పుడు కూడా మోదీ ఇదే విధానాన్ని అనుసరించారు. మోదీ ప్రభుత్వం ఇంతకాలం అనుసరిస్తున్న విధానానికి ఇది భిన్నమైన వైఖరి ఏమీకాదు. ఈ సమస్యపైన ప్రతిపక్షాలన్నీ ఒక్కటై ఐక్యతను చాటడానికి లోక్‌సభను బహిష్కరించడం ఆహ్వానించదగిన పరిణామం. ఈ సమావేశాలు ప్రారంభమయ్యాక ప్రతిపక్షాలు ఐక్యతను ప్రదర్శించడం ఇది రెండవసారి. ముఖ్యంగా ఆమ్ ఆద్మీ, బీఆర్ఎస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు కాంగ్రెస్ నాయకత్వంలో పార్లమెంటును బహిష్కరించడం తప్పకుండా పరిగణించాలి. ఈ మూడు పార్టీలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇతర ప్రతిపక్షాలన్నింటితో కలిసి ఫ్రంట్‌గా ఏర్పడి బీజేపీతో ముఖాముఖి పోటీ జరిగే విధంగా ప్రణాళిక రూపకల్పన చేయాలి. దీనివల్ల అన్నిరంగాల్లో దేశ ప్రజలకు నష్టం కలిగించే విధానాలు అమలుగాకుండా బీజేపీ ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో ఓడించడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. తాజాగా జరిపిన వాకౌట్‌లో 18 ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయడానికి కలిసివచ్చాయి. భారత్-చైనా మధ్య వాస్తవాధీనరేఖ వద్ద ఏర్పడిన తీవ్ర సమస్యపై కూడా చర్చించకపోవడం ఎంతమాత్రం ప్రభుత్వాన్ని క్షమించదగిందికాదు. విభేదాలున్నప్పటికీ వాటిని పక్కనబెట్టి టీఎంసీ, ఆప్, బీఆర్ఎస్‌లు కూడా వచ్చి ప్రతిపక్ష ఐక్యతను ప్రదర్శించాయి. వాకౌట్ తర్వాత ఈ ప్రతిపక్షాలన్నీ సమావేశమయ్యాయి. సమావేశంలో సీపీఐ, సీపీఎం, ఆర్‌జేడీ, జేడీయూ, ఎస్‌పీ, ఆర్ఎల్‌డీ, ఎన్‌సీపీ, శివసేన(ఉద్ధవ్ థాకరే విభాగం) తదితర పార్టీలు పాల్గొన్నాయి. కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, అధీర్‌రంజన్ చౌదరి లోక్‌సభ నుంచి, రాజ్యసభ నుంచి చేసిన వాకౌట్‌కు మల్లిఖార్జునఖర్గేలు నాయకత్వం వహించారు. ఈ సమావేశాలు డిసెంబరు 29వ తేదీ వరకు జరుగుతాయి. వాకౌట్ తర్వాత జరిగిన సమావేశానికి మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షత వహించారు. భారత్-చైనా మధ్య తాజాగా తలెత్తిన ఘర్షణ పూర్వపరాలను చర్చించి తర్వాత అనుసరించవలసిన వ్యూహాన్ని ఈ సమావేశం రూపొందించింది. ఈ సమస్యపై సమూలంగా చర్చించేవరకు నిరసన కొనసాగించేందుకు ప్రతిపక్షాలన్నీ అంగీకరించాయి.

దిల్లీలో బుధవారం ప్రతిపక్షాల సమావేశం అనంతరం పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న మల్లిఖార్జున ఖర్గే. చిత్రంలో సీపీఐ కార్యదర్శి వినయ్ విశ్వం తదితరులు

అయితే ఇంతవరకు జాతీయస్థాయిలో ప్రతిపక్షాలఫ్రంట్ ఏర్పాటులో కలిసిరావడానికి విముఖంగాఉన్న ఆప్, టీఎంసీ, బీఆర్ఎస్ ఇప్పుడు తమవైఖరిని ఏమైనా మార్చుకున్నాయా అనేది ముఖ్యమైన ప్రశ్న. 2014లో 31శాతం ఓట్లతో, 2019లో 38శాతం ఓట్లతో లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి ఏర్పాటు బీజేపీ ప్రభుత్వం స్థానంలో ప్రతిపక్షాల ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడాలంటే జాతీయ ఫ్రంట్‌లో ఈ మూడు పార్టీలు కలిసిరాకపోతే దేశ ప్రజలను మోసగించినట్లే అవుతుంది. ముఖ్యమైన వాగ్దానాలను నెరవేర్చకుండా నియంతృత్వ పోకడలలో పరిపాలిస్తున్న మోదీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసగించినట్టుగానే ప్రతిపక్షాలు కూడా చేశాయన్న భావన ప్రజల్లో ఏర్పడుతుంది. ప్రతిపక్షాలన్నిటికీ కలిపి 62శాతం ఓట్లు ఉన్నాయి. ఈ ఓట్లు ఒక్కటైతే మోదీ ప్రభుత్వాన్ని ఓడించడం సాధ్యమే. ఇటీవల గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలకు, వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. మోదీ ప్రభావం గొప్పగా ఉన్నట్లయితే హిమాచలప్రదేశ్, గుజరాత్‌లలో ఆయన ప్రచారం ఒకేస్థాయిలో జరిగింది. వాగ్దానాలు, ప్రాజెక్టుల ప్రకటన, శంకుస్థాపనలు దాదాపు ఒకేరకంగా ఉన్నాయి. ఫలితాలు వేరుగా ఉన్నాయి. అనేక కిలోమీటర్ల దూరం నడక, వాహనంపై రోడ్డుషోలు జరిగాయి. అ రెండు రాష్ట్రాల్లోనూ హోం మంత్రి అమిత్‌షా ఇతర మంత్రులు, ఎంపీలు, సంఘ్‌పరివార్ కార్యకర్తలు ఇల్లిల్లు తిరిగి ప్రచారం చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీకి ఓటింగ్ శాతం దాదాపు కాంగ్రెస్‌కు దగ్గరలోనే ఉంది. గుజరాత్‌లో ఈ సారి 54శాతం మంది ఇప్పుడున్న ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారని ఒక సర్వే చెప్పింది. చివరకు బీజేపీ ఘనవిజయం సాధించింది. ఈ అంశాలను ప్రతిపక్షాలు తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలి. ముఖ్యంగా ఆప్ నాయకుడు కేజ్రీవాల్ దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచినప్పటికీ బీజేపీ బలమైన ప్రతిపక్షంగా నిలిచింది. ఇంతవరకు దిల్లీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలకు లెఫ్టినెంట్ గవర్నరు అడుగడుగునా అడ్డుపడుతున్నారు. కార్పొరేషన్‌లో బలంగాఉన్న బీజేపీ సైతం అన్నివిధాలుగా ఆటంకాలు కల్పించకమానదు. ఇక కాంగ్రెస్ గుజరాత్‌లో 2017నాటి ఎన్నికల్లో వచ్చిన ఓట్లలో 15శాతం కోల్పోయింది. దిల్లీ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ కోలుకోలేని విధంగా దెబ్బతింది. తమవి జాతీయ పార్టీలని చెప్పుకున్నంత మాత్రాన ఒరిగేదేమీలేదు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ జాతీయ పార్టీగా ఎందుకు ప్రకటించారో ఆయనకే తెలియాలి.

2023లో కర్ణాటక, తెలంగాణ తదితర చాలా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నాటికి పార్లమెంటులో ఐక్యత ప్రదర్శించిన పార్టీలన్నీ ఫ్రంట్‌గా ఏర్పడి పోటీచేయడం ద్వారా ప్రజలకు ఫ్రంట్‌మీద విశ్వాసం కలిగించాలి. ప్రతిపక్షాల ఫ్రంట్ ఏర్పాటుకు కృషిచేస్తానని ముందుకు వచ్చిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఎన్‌సీపీ అధినేత శరద్‌పవర్‌తో కలిసి ప్రతిపక్షాలను ఒప్పించ గలిగితే సగం విజయం సాధించి నట్లవుతుంది. పైగా ప్రతిరాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులున్నాయి. అందువల్ల అన్నిచోట్ల బీజేపీకి అనుకూలతలుంటాయని భావించవలసిన పనిలేదు. అయితే ఫ్రంట్ ఏర్పాటుకు సహకరించని పార్టీలను భవిష్యత్‌లో ప్రజలు కచ్చితంగా ఆదరిస్తారన్న ఆశ కేజ్రీవాల్, మమతాబెనర్జీలాంటి నాయకులకు ఉండవచ్చుగానీ, ఆనాటికి మోదీ మరింతబలపడే అవకాశాలుంటాయి. ఇప్పుడు ఫ్రంట్‌కు కలిసి రాకపోతే ఆయా పార్టీలు మరింత నష్టపోయే పరిస్థితులూ ఉన్నాయి.

కాంగ్రెస్ కల నిజమయ్యేనా

జైపూర్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, వయనాడ్ లోక్‌సభ సభ్యుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర శుక్రవారానికి 100వ రోజుకు చేరుకుంటుంది. ప్రస్తుతం రాజస్థాన్‌లో ఈ యాత్ర కొనసాగుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 7వ తేదీన తమిళనాడులోని కన్యాకుమారి వద్ద రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను ప్రారంభించారు. కేరళ, కర్ణాటక, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మీదుగా రాజస్థాన్‌కు చేరుకుంది. దీని తరువాత హరియాణాలో అడుగు పెట్టనున్నారు రాహుల్‌గాంధీ. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జమ్ముకశ్మీర్‌లో ఈ యాత్ర ముగియాల్సి ఉంది. అయితే వంద రోజుల యాత్ర సందర్భంగా... 2024 ఎన్నికలకు వెళ్లే మార్గంలో వెదుకుతున్న కొన్ని సమాధానాలు పార్టీకి లభ్యమైనట్లుగా కాంగ్రెస్‌ను గమనిస్తున్న విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ యాత్ర ఎన్నికల డివిడెండ్‌లను ముందుకు తీసుకువెళుతుందా అనే ప్రశ్నలు మిగిలి ఉన్నాయి. గత మూడు నెలల్లో జోడోయాత్ర అనేక వివాదాలకు దారితీసింది. రాహుల్ నెరిసిన గడ్డం, ఆయన వేసుకున్న టీ-షర్ట్ సహా వివిధ అంశాలు కాంగ్రెస్-బీజేపీ మధ్య మాటల యుద్ధం జరిగింది. 2,800 కి.మీ. యాత్రలో రాహుల్ గాంధీ తన మద్దతుదారులతో పాటు వ్యతిరేకుల దృష్టిని కూడా ఆకర్షించగలిగారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అన్ని వర్గాల వారితో మమేకం అయ్యారు. పూజా భట్, రియా సేన్, సుశాంత్ సింగ్, స్వరా భాస్కర్, రష్మీ దేశాయ్, ఆకాంక్ష పూరి, అమోల్ పాలేకర్ వంటి చలనచిత్ర, టీవీ ప్రముఖులతో సహా వివిధ వర్గాల నుంచి సంఘీభావం పొందారు. మాజీ నేవీ చీఫ్ అడ్మిరల్ ఎల్ రాందాస్, శివసేనకు చెందిన ఆదిత్య ఠాక్రే, ఎన్‌సీపీకి చెందిన సుప్రియా సూలే, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ సహా అనేకమంది ప్రముఖులు, రచయితలు వివిధ సమయాల్లో ఈ యాత్రలో పాల్గొన్నారు. అయితే కొంతమంది రాజకీయ పండితులు మాత్రం యాత్ర... మరింత స్పష్టమైన రాజకీయ లక్ష్యాలను కలిగి ఉండాలని భావిస్తున్నారు. యాత్ర ఏదైనా ఎన్నికల డివిడెండ్‌గా మారుతుందా అనే ప్రశ్నల మధ్య, ఇటీవల ముగిసిన రెండు అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్‌కు మిశ్రమ ఫలితాలనిచ్చాయి. ఆ పార్టీ హిమాచల్‌లో గెలుపొందగా, గుజరాత్‌లో గతంలో ఎన్నడూలేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. జోడో యాత్ర బాగా కవర్ చేయబడిన కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ సహా వచ్చే ఏడాది వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో రాహుల్ చేపట్టిన జోడో యాత్ర ద్వారా పార్టీకి ఏ మేరకు లబ్ధి జరుగనుందో తేలనుంది.

కాంగ్రెస్ మాజీ నాయకుడు సంజయ్ ఝా మాట్లాడుతూ... దీర్ఘకాలంలో భారత్ జోడో యాత్ర కాంగ్రెస్‌కు 'గేమ్ చేంజర్' కాగలదని అన్నారు. ఈ ప్రజా ఉద్యమం ద్వారా కాంగ్రెస్ పార్టీ నేరుగా ప్రజలతో అనుసంధానమైందని, రాహుల్ రాజకీయ ఛరిష్మాను పునరుద్ధరించిందని చెప్పారు. ఇకమీదట బీజేపీ అతనిపై నకిలీ వార్తలను వ్యాప్తి చేయలేదన్నారు. యాత్ర కచ్చితంగా అట్టడుగు స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్న ఝా... ఇకపై కాంగ్రెస్...ఉత్సాహపూరితులైన కార్యకర్తల ద్వారా సమీకరణను కొనసాగించడమే కీలకమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది, కర్ణాటక, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మొదలైన రాష్ట్రాల్లో జోడో యాత్ర ప్రభావం ఎక్కువగా కనిపిస్తుందని ఆయన చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ప్రొఫెసర్, రాజకీయ వ్యాఖ్యాత సంజయ్ పాండే మాట్లాడుతూ... యాత్ర పార్టీలో ఆశల మెరుపులు నింపిందన్నారు. సాధారణ పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచింది కానీ ఇది ఎన్నికల లాభాలుగా మారుతుందా అనేది కాలమే నిర్ణయిస్తుందని అన్నారు.

100 రోజుల భారత్ జోడో యాత్ర

ప్రజలతో మమేకమైన రాహుల్

కార్యకర్తల్లో నూతనోత్తేజం

ఎన్నికల లబ్ధిపై సందేహాలు

భారత్ జోడో యాత్ర వందో రోజును పురస్కరించుకుని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు మొదలు పెట్టింది. జైపూర్‌లో భారత్ జోడో యాత్ర మ్యూజికల్ కన్సర్ట్‌ను నిర్వహించనుంది. బాలీవుడ్ గాయని సునిధి చౌహాన్ ఈ కన్సర్ట్‌కు హాజరు కానున్నారు.

దేశభక్తిని పెంపొందించే గీతాలను ఆమె ఆలపించనున్నారు. సునిధితో పాటు రాజస్థాన్‌కు చెందిన జానపద కళాకారులు ఇందులో ప్రదర్శన ఇవ్వనున్నారు. సీఎం అశోక్ గెహ్లాట్ సహా వందో రోజు భారత్ జోడో యాత్రలో హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలందరూ కూడా ఈ యాత్రలో పాల్గొనబోతోన్నారు. వారు రాహుల్ గాంధీని కలవనున్నారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం యాత్ర ముగిసే వరకూ వారందరూ రాహుల్ గాంధీతో కలిసి నడుస్తారు. ఆ మరుసటి రోజు యాత్రకు ఉండదు. రాహుల్ గాంధీ విశ్రాంతి తీసుకోనున్నారు.

బీజేపీ విద్వేషానికి భారత్ జోడోతో చెక్

మహిళల్ని అణచివేసే సంస్థ ఆర్ఎస్ఎస్

అందుకే స్త్రీ సభ్యత్వం లేదు : రాహుల్ గాంధీ

జైపూర్: దేశంలో బీజేపీ సృష్టించే విద్వేషానికి చెక్ పెట్టే లక్ష్యంతోనే కాంగ్రెస్ భారత్ జోడో యాత్రను చేపట్టినట్లు హస్తం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. భయోత్పాదాన్ని వ్యాప్తి చేయడమే బీజేపీ-ఆర్ఎస్ఎస్ వ్యూహమన్నారు. తొలుత భయపెట్టి ఆపై దానిని విద్వేషంగా రగిల్చి లబ్ధి పొందడమే వాటి సిద్ధాంతమని విమర్శించారు. దేశాన్ని విభజించే లక్ష్యంతోనే బీజేపీ-ఆర్ఎస్ఎస్ పనిచేస్తున్నాయని, వాటి ప్రయత్నాలను తిప్పికొట్టేందుకే భారత్ జోడో యాత్రను కాంగ్రెస్ చేపట్టిందని రాహుల్ తెలిపారు. ఆర్ఎస్ఎస్ మహిళలను అణచివేస్తుంది కాబట్టే ఆ సంఘంలో మహిళలు కనిపించరన్నారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ సంఘాల్లోకి మహిళలకు ప్రవేశమే లేదని ఆయనన్నారు. సీతను అవమానించేలా జై శ్రీరామ్ నినాదమిస్తున్నాయని దుయ్యబట్టారు. జై సియారామ్ అనకుండా జైశ్రీరామ్ అంటూ సీతాదేవిని అవమానించారన్నారు. భారతీయ మహిళలను ఎందుకు అమానిస్తారు? సీతను కాదని జైశ్రీరామ్ అని మాత్రమే ఎందుకు అంటారు? అని బీజేపీ-ఆర్ఎస్ఎస్‌ను రాహుల్ ప్రశ్నించారు. దేశ సంపద కొద్దిమంది సంపన్నుల చేతిలో ఉన్నదని వ్యాఖ్యానించారు. భారత్‌లోని 100 మంది సంపన్నుల ఆస్తి దాదాపు 55 కోట్ల మంది వద్ద ఉన్నదానికి సమానమని రాహుల్ గాంధీ అన్నారు. 'భారతదేశ సంపదలో సగం కేవలం 100 మంది వద్ద ఉన్నది. వారి కోసమే దేశం నడుస్తోంది. భారత మహారాజులు నలుగురు, ఐదుగురు ఉన్నారు. ప్రభుత్వమే కాదు మొత్తం మీడియా, బ్యూరోక్రాట్లుతో సహా స్వయంగా ప్రధాని మోదీ కూడా వారి ఆదేశాలనే పాటిస్తారు' అని రాహుల్ విమర్శించారు. కాగా, తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభమైన భారత్ జోడో యాత్ర శుక్రవారానికి 100 రోజులు పూర్తిచేసుకోనున్నది. ఈ సందర్భంగా రాజస్థాన్, జైపూర్‌లో వేడుకను కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విషయం విదితమే.

వంతెనలకు క్రాష్ బారియర్లు

న్యూదిల్లీ: నదులు, కాలువలపై ఉన్న వంతెనలపై తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈక్రమంలో వంతెనలవద్ద వాహనాల భద్రతా ప్రమాణాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా ఉన్న బ్రిడ్జీలపై రెయిలింగ్స్ తొలగించి వాటి స్థానంలో బారియర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఇటీవల ప్రముఖ పారిశ్రామికవేత్త సైరస్ మిస్త్రీ కారు ప్రమాదంలో అకాలమరణం చెందిన విషయం తెలిసిందే. కారు అతివేగం, సీటు బెల్టు పెట్టుకోకపోవడంతో పాటు ప్రమాదం జరిగిన వంతెన వద్ద క్రాష్ బారియర్లు లేకపోవడం కూడా ఈ దుర్ఘటనకు కారణమని సమాచారం. వంతనలపై రెయిలింగ్స్‌ను తొలగించి క్రాష్ బారియర్లను ఏర్పాటు చేసే అవసరంపై కేంద్ర రోడ్లు, రహదారుల మంత్రిత్వ శాఖ ఇటీవల, అన్ని రాష్ట్రాలు, జాతీయ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు ఓ సర్క్యులర్ జారీ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. "వంతెనలపై రాకపోకలు సాగించే వాహనాలకు భద్రత కల్పించేందుకు క్రాష్ బారియర్లను ఏర్పాటు చేయడం అత్యవసరం. అయితే, ప్రస్తుతం ఉన్న వంతెనలను వెడల్పు చేయకుండా వాటి రెయిలింగ్స్‌ను మార్చడం నిర్మాణపరంగా సమర్థంగా ఉంటుందా? లేదా? అన్నదే సమస్య. ఈ విషయాన్ని మంత్రిత్వశాఖ పరిశీలిస్తోంది. అయితే, రెయిలింగ్స్ స్థానంలో క్రాష్ బారియర్లను ఏర్పాటు చేసేముందు కొన్ని కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. క్రాష్ బారియర్ల నిలువు పటిష్టత, డిజైన్ లోడ్, కాంక్రీట్ నాణ్యతను తనిఖీ చేయాలి" అని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఇక ఫుట్‌పాత్ ఉన్నా లేకపోయినా కొత్తగా నిర్మించే వంతెలకు క్రాష్ బారియర్లను ఏర్పాటు చేయాలని ఆ సర్క్యులర్‌లో సూచించారు. 'రెండు లేన్లతో ఉన్న వంతెనలన్నీ వెడల్పు చేసినా చేయకపోయినా లోపలి వైపు క్రాష్ బారియర్లు.. బయటివైపు పాదచారుల రెయిలింగ్స్‌ను తప్పనిసరిగా ఏర్పాటుచేయాలి. ఇక నాలుగు లేన్లతో ఉన్న వంతెనలకైతే.. రెయిలింగ్స్‌ను తొలగించి వాటి స్థానంలో క్రాష్ బారియర్లను అమర్చాలి" అని కేంద్ర మంత్రిత్వశాఖ స్పష్టం చేసినట్లు ఆ సర్క్యులర్‌లో ఉంది.

సీఐసీ వద్ద 22వేల అపరిష్కృత అప్పీళ్లు

న్యూదిల్లీ: కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) వద్ద డిసెంబర్ 5, 2022 నాటికి 22 వేల అప్పీళ్లు, ఫిర్యాదులు అపరిష్కృతంగా ఉన్నాయని కేంద్రం గురువారం రాజ్యసభకు తెలిపింది. సీఐసీ దరఖాస్తుదారులు... ప్రభుత్వ శాఖలు వారికి అందించిన సమాధానంతో బాధపడినట్లయితే వారు దాఖలు చేసిన రెండవ అప్పీళ్లు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు సీఐసీ ఆమోదం తప్పనిసరి. మొత్తం పెండింగ్‌లో ఉన్నవి 22,442 కాగా అందులో 19,178 రెండవ అప్పీళ్లు, 3,264 ఫిర్యాదులు ఉన్నట్లు కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఒక లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. కొంతమంది ఆర్టీఐ దరఖాస్తుదారుల వ్యక్తిగత సమాచారం బహిరంగపరచబడిన సందర్భాల గురించి ప్రభుత్వానికి తెలియదా అనే ప్రశ్నకు, కేంద్రం ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు లేదా కార్యాలయ మెమోరాండంలను జారీ చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

60 లక్షలకు పైగా ప్రజా ఫిర్యాదులు

గత మూడేళ్లలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై 60 లక్షలకు పైగా ప్రజా ఫిర్యాదులు అందాయని కేంద్రప్రభుత్వం రాజ్యసభకు తెలిపింది. 01.01.2020 నుంచి 30.11.2022 వరకు కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కార, పర్యవేక్షణ వ్యవస్థ (సీపీజీఆర్ఏఎంఎస్)పై సుమారు 60,15,388 ఫిర్యాదులు అందినట్లు మంత్రి జితేంద్ర సింగ్ లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలపై ఆన్‌లైన్‌లో ప్రజా ఫిర్యాదులను దాఖలు చేయడానికి సీపీజీఆర్ఏఎంఎస్ స్వీకరిస్తుంది. ఫిర్యాదులను సకాలంలో, సమర్థంగా పరిష్కరించడంపై ప్రభుత్వం సున్నితంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. మొత్తం రశీదుల్లో 4,72,866 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై అత్యధికంగా 12,54,960 ఫిర్యాదులు (వీటిలో 40,078 పెండింగ్‌లో ఉన్నాయి) దాఖలు కాగా మహారాష్ట్రపై 5,60,139 (పెండింగ్‌లో 67,465), ఢిల్లీపై 4,73,940 (పెండింగ్‌లో 26,846), పశ్చిమ బెంగాల్‌పై 3,90,041 (పెండింగ్‌లో48,955), గుజరాత్ ప్రభుత్వంపై 3,57,574 (పెండింగ్‌లో 25,667) రాజస్థాన్‌పై 3,55,724 (పెండింగ్‌లో 8,985), మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై 3,40,954 ఫిర్యాదులు (పెండింగ్‌లో 19,618), బీహార్‌పై 3,21,365 (పెండింగ్‌లో44,461) తమిళనాడుపై 2,72,552 (పెండింగ్‌లో 12,325), తెలంగాణపై 1,19,122 (పెండింగ్‌లో 2,770), ఆంధ్రప్రదేశ్‌పై 94,326 (పెండింగ్‌లో 17,851) ఉన్నాయి. ఫిర్యాదుల పరిష్కారంపై పౌరుల అభిప్రాయాన్ని పొందడానికి ప్రభుత్వం కాల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారంలో పౌరులు సంతృప్తి చెందకపోతే కాల్ సెంటర్ ద్వారా దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా పొందవచ్చని ఆయన చెప్పారు.

మద్యం తాగితే చస్తారు: నితీశ్

పాట్నా: బీహార్ అసెంబ్లీని కల్తీ మద్యం ఎపిసోడ్ ఊపేస్తోంది. 40మంది కల్తీమద్యం తాగి ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష బీజేపీతోపాటు బాధిత కుటుంబాలు ఆందోళన చేపట్టాయి. దీనిపై తీవ్రంగా స్పందించిన సీఎం నితీశ్ ఎట్టి పరిస్థితుల్లోనూ పరిహారం ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మద్యం తాగితే చస్తారని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిందేనని స్పష్టం చేవారు. రాష్ట్రంలో 2016 నుంచి మద్య నిషేధం అమల్లో ఉన్న విషయాన్ని నితీశ్ గుర్తు చేశారు. 'కల్తీ మద్యం తాగి గతంలోనూ చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని అడుగుతున్నారు. మద్యం తాగినవారు కచ్చితంగా చనిపోతారు. ఇందుకు మన కళ్లముందున్న ఘటనే సాక్ష్యం'అని నితీశ్ కుమార్ వ్యాఖ్యానించారు. మద్యపాన నిషేధం అమల్లో లేని సమయంలోనూ కల్తీ మద్యంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేవలం బీహార్‌లోనే కాకుండా నిషేధం అమలులో ఉన్న గుజరాత్‌తోపాటు పంజాబ్‌లోనూ ఈ తరహా ఘటనలు జరిగాయన్నారు. బీహార్‌లో మద్య నిషేధ అమలుకు అన్నిరకాలుగా కృషి చేస్తామన్నారు.

40కి చేరిన మృతుల సంఖ్య

సారణ్ జిల్లా ఛప్రా ప్రాంతంలోని ఇసువాపుర్ పోలీస్‌స్టేషను పరిధిలో కల్తీ మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 40కి చేరింది. మరింతమంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. మరోవైపు కల్తీ మద్యం ఘటనపై ముఖ్యమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలని, బాధితులకు పరిహారం అందించాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఇదే విషయంపై అసెంబ్లీలో బుధవారం ప్రతిపక్షాలు చేసిన నిరసనలపై మండిపడ్డ నితీశ్ కుమార్ 'తాగి సభకు వచ్చారా..?' అని విపక్షాలపై విరుచుకుపడిన సంగతి తెలిసిందే.

మోదీ... మౌనమేల?

చైనాపై ప్రధాని తీరుకు కాంగ్రెస్ అసహనం

న్యూదిల్లీ: చైనా తీరుపై మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని కాంగ్రెస్ పార్టీ గురువారం నిలదీసింది. ఈ సందర్భంగా 1962 నాటి యుద్ధం సమయంలో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పార్లమెంట్‌లో వ్యవహరించిన తీరును ప్రస్తావిస్తూ.. మోదీ సర్కారును ఎద్దేవా చేసింది. నాడు వాజ్‌పేయీ డిమాండ్ చేయడంతో నెహ్రూ చర్చ చేపట్టారని ఏఐసీసీ మీడియా హెడ్ పవన్ ఖేడా గుర్తు చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వెంట చైనా సైనికుల చొరబాటు యత్నం ఘటనపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు అంగీకరించకపోవడంపై కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది.



అప్పుడు కాంగ్రెస్ ఎంపీలూ ప్రశ్నించారు..

"1962లో భారత్-చైనా యుద్ధం జరిగినప్పుడు పార్లమెంట్‌లో దానిపై చర్చ చేపట్టాలని అటల్ బిహారీ వాజ్‌పేయీ డిమాండ్ చేశారు. అందుకు నెహ్రూ(అప్పటి ప్రధాని) అంగీకరించారు. ఆ చర్చను రహస్యంగా ఉంచాలని ఓ ఎంపీ అప్పట్లో సూచించారు. కానీ, నెహ్రూ అందుకు సమ్మతించలేదు. అంతెందుకు.. ఆ చర్చలో కాంగ్రెస్ ఎంపీలు కూడా సొంత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చరిత్ర నుంచి ప్రధాని మోదీ నేర్చుకోవాలి" అని పవన్ ఖేడా హితవు పలికారు. "చైనాతో మీకున్న అనుబంధం ఏంటి? సరిహద్దు వివాదాలపై మాట్లాడకుండా మౌనంగా ఉండేలా మిమ్మల్ని బలవంతపెడుతున్న పరిస్థితులేంటి? ఈ ప్రశ్నలకు యావత్ దేశం సమాధానాలు తెలుసుకోవాలనుకుంటోంది" అని పవన్ ఖేడా ప్రధానిపై ప్రశ్నల వర్షం కురిపించారు. "చైనా అంశంపై ప్రతిపక్షాలు, మీడియా ఏం పట్టనట్లుగా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటోంది. దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరపకుండా దూరంగా పారిపోతోంది. దీనిపై ప్రధాని మోదీ ఏం మాట్లాడట్లేదు. ఒకవేళ మాట్లాడాల్సి వచ్చినా చైనాకు ఆయన క్లీన్‌చిట్ ఇస్తారు" అని పవన్ ఖేడా మీడియా సమావేశంలో అన్నారు. గతంలో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చైనా కంపెనీలకు ఆ రాష్ట్రంలో భూములు కేటాయించారని ఆయన ఆరోపించారు. 'పీఎం కేర్స్' ఫండ్స్‌కు చైనా కంపెనీలు విరాళాలిస్తున్నాయని దుయ్యబట్టారు. దీని వెనుక మర్మమేంటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వద్ద ఈ నెల 9వ తేదీన ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. సరిహద్దుల్లో యథాతథ స్థితిని మార్చేందుకు చైనా సైన్యం ప్రయత్నించింది. భారత సైన్యం వారిని తిప్పికొట్టడంతో డ్రాగన్ బలగాలు తిరిగి తమ స్థానాల్లోకి వెళ్లిపోయాయని ఇటీవల కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంట్‌లో ప్రకటన చేశారు. అయితే, దీనిపై చర్చ జరపాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

'గోధ్రా' దోషికి 17ఏళ్ల తర్వాత బెయిల్

న్యూదిల్లీ: గుజరాత్‌లోని గోధ్రా రైలు దహనకాండకు సంబంధించిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఓ దోషికి సుప్రీంకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఆ వ్యక్తి 17 ఏళ్ల పాటు జైల్లోనే ఉన్న కారణంగా అతడికి బెయిల్ ఇస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో మరికొందరు దోషులు కూడా బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఆ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 2002, ఫిబ్రవరి 27న గోధ్రా రైల్వేస్టేషన్‌లో సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలుకు నిప్పంటించడంతో ఎస్-6 బోగీలోని 59 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన సమయంలో బోగీపై రాళ్లదాడికి పాల్పడినందుకు గానూ ఫారుక్ సహా మరికొందరికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. కాగా.. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ కొందరు దోషులు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీటిపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. 17 ఏళ్ల పాటు అనుభవించిన జైలు శిక్షను పరిగణనలోకి తీసుకుని, బెయిల్ మంజూరు చేయాలంటూ ఫారుక్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనను అంగీకరించిన ధర్మాసనం.. అతడికి బెయిల్ మంజూరు చేసింది. అయితే మిగతా పిటిషన్లపైనా త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశముంది. కాగా.. దోషుల బెయిల్ పిటిషన్లను అంతకుముందు గుజరాత్ ప్రభుత్వం వ్యతిరేకించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దోషులు చేసింది సాధారణ రాళ్లదాడి కాదని, వీరివల్ల బోగీలోని ప్రయాణికులు బయటకు రాలేకపోయారని కోర్టుకు వివరించారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించిన అగ్నిమాపక సిబ్బందిపైనా వీరు రాళ్లు విసిరారని తెలిపారు.

భార్యపై కోపంతో పవార్‌కు బెదిరింపులు

పోలీసుల విచారణలో నిందితుడు

ముంబై: తన భార్య ఎన్సీపీ కార్యకర్తతో వెళ్లిపోతే ఆ పార్టీ అధినేత జోక్యం చేసుకోలేదన్న కోపంతోనే ఆయనను బెదిరించానని శరద్ పవార్‌కు బెదిరింపుల కేసులో పట్టుబడ్డ వ్యక్తి విచారణ సమయంలో తెలిపినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. 'నిందితుడు పూనేకు చెందిన 46ఏళ్ల వ్యక్తి. అతను తన భార్యతో కలిసి పదేళ్ల కిందట బీహార్‌లో స్థిరపడ్డారు. అంతకుముందు పూనేలో ఉండేవారు. పూనేలో ఉండగానే అతని భార్య మరొక వివాహితుడు(ఎన్సీపీ కార్యకర్త)తో వెళ్లిపోయింది. దీంతో దక్షిణ ముంబైలోని శరద్ పవార్ నివాసంలోని ఫోన్‌కు అనేకమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఆగ్రహావేశానికిలోనై ఎన్సీపీ అధ్యక్షుడిని చంపేస్తానంటూ ఇతను బెదిరించాడు' అని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. నిందితుడు చెప్పినదాంట్లో నిజమెంతో నిగ్గుతేల్చాల్సి ఉన్నదన్నారు. బుధవారం పాట్నాలో ముంబై పోలీసులు ఇతనిని అరెస్టు చేయగా కోర్టు రెండు రోజుల పోలీసు కస్టడీ విధించిందని అధికారి వెల్లడించారు.

3.7లక్షల మందికి జీవన్ ప్రమాణ్ సేవలు

న్యూదిల్లీ: ముఖ ప్రామాణికత సాంకేతికను ఉపయోగించి జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా జీవిత ధ్రువీకరణ పత్రాలను 3.7లక్షల మందికిపైగా కేంద్రప్రభుత్వ పింఛన్‌దారుల సమర్పించినట్లు కేంద్రప్రభుత్వం తెలిపింది. 2022, డిసెంబరు 8 వరకు ఈ పద్ధతిలో జీవిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన పింఛన్‌దారుల సంఖ్య 3,71,364గా ఉన్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభకు రాతపూర్వకంగా వెల్లడించారు. ఏటా కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు పింఛన్ నిరాంటకంగా అందుతోందని ఆయన తెలిపారు. 2021 నవంబరు నుంచి జీవిత ధ్రువీకరణ పత్రాల సమర్పణ కోసం ముఖ ప్రామాణికత సాంకేతికను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం విదితమే.

ప్రపంచవ్యాప్తంగా తగ్గిపోతున్న శాకహారులు

న్యూదిల్లీ: జంతువుల సంరక్షణ, పర్యావరణ వనరుల పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవనం కోసం అత్యధిక శాతం మంది శాకాహారాన్ని ఎంచుకునేవారు. సంస్కృతి, సంప్రదాయాలను అనుసరిస్తూ శాకాహారాన్ని మాత్రమే తీసుకునేవారు ఉన్నారు. ఇటీవల కాలంలో కర్బన ఉద్గారాల నియంత్రణతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలి కోసమంటూ ప్రత్యేకంగా కొందరు శాకాహారం వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా శాకాహారుల సంఖ్య తగ్గుతుందా అంటే ... అవుననే అంటున్నాయి సర్వేలు. ఐరోపా లేదా బ్రిటన్ దేశాలలో వీరి సంఖ్య తగ్గుతోంది. స్టాటిస్టా గ్లోబల్ కన్స్యూమర్ సర్వే ఓ నివేదికను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా శాకాహారం క్షీణిస్తోందని నివేదికలో పేర్కొంది. ఉదాహరణకు భారత్‌లోనూ సంప్రదాయ శాకాహారులు కూడా ఆహారం కోసం రెండు విధానాలను పాటిస్తున్నారు. మాంసాహారాన్ని కూడా తీసుకుంటున్నారు. 2018/2019 పట్టణ భారతీయులలో మూడొంతుల మంది తాము శాకాహారులమని పేర్కొనగా, 2021/2022 నాటికి ఈ సంఖ్య దాదాపు నాలుగింట ఒకవంతుకు తగ్గింది. గత మూడేళ్లలో శాకాహారం జనాదరణ పొందినప్పటికీ కొన్ని దేశాల్లో మాంసాహారాన్ని ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతోంది. మెక్సికో, స్పెయిన్‌లలో శాకాహారుల రేటు ఇటీవల 3 శాతం కంటే తక్కువగా ఉన్నట్లు సర్వే పేర్కొంది. 2018/2019లో శాకాహారుల రేటు 3 శాతం దగ్గర ఉండగా, దక్షిణ కొరియాలో కూడా ఇంచుమించు ఇదే శాతం నమోదైంది. 2018/2019లో శాకాహారుల రేటు 0.9 శాతం నుండి పెరిగింది.

కార్మికులకు సులభంగా వైద్యసేవలు

న్యూదిల్లీ: కార్మికులకు వైద్య సేవలు సులువుగా అందేలా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని కార్మికశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. న్యూదిల్లీ రోహిణిలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో అభ్యసించిన 2015, 2016 బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం గురువారం సిరిఫోర్ట్ ఆడిటోరియంలో జరిగింది. దీనికి హాజరైన మంత్రి మాట్లాడుతూ... దేశంలోని కార్మికులంతా వైద్య సేవలను సులువుగా పొందేలా మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. కార్మిక, ఉపాధికల్పన శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి మాట్లాడుతూ... కోవిడ్-19 అనిశ్చిత సమయంలో పేదలకు సేవ చేయడం కోసం ఈఎస్ఐసీ వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది చేసిన ప్రయత్నాలను అభినందించారు.

సామాజిక భద్రతా కోడ్‌ను అమలు చేయడం వల్ల ఈఎస్ఐ పథకం కింద కార్మికుల సంఖ్య అనేక రెట్లు పెరుగుతుందని కార్మిక శాఖ కార్యదర్శి ఆర్తి ఆహూజా అన్నారు. భవిష్యత్తులో ఈఎస్ఐసీ పని చాలా రెట్లు పెరగబోతోందని, ఇందుకోసం సన్నద్ధం కావాలని ఆమె పేర్కొన్నారు.

6న ఎంసీడీ కొత్త కౌన్సిలర్ల తొలి సమావేశం

న్యూదిల్లీ: ఎంసీడీ నూతన కౌన్సిలర్ల భేటీ జనవరి 6వ తేదీన జరగనుంది. దిల్లీ ఎల్‌జీ వీకే సక్సేనా ఇందుకు అంగీకారం తెలిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, 1957లోని సెక్షన్ 73 కింద ఉన్న అధికారుల క్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా కొత్త కౌన్సిలర్ల సమావేశాన్ని జనవరి 6న నిర్వహించేందుకు అంగీకరించినట్లు వెల్లడించాయి. అయితే ఈ సమావేశాన్ని నిర్వహించాలని పట్టణాభివృద్ధి శాఖకు ఈనెల 12న ఎంసీడీ కమిషనర్ ప్రతిపాదించారు. ఆపై ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా (పట్టణాభివృద్ధి మంత్రికూడా), ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంతకాలు చేసిన సంబంధిత ఫైలు బుధవారం రాజ్ నివాస్‌కు చేరింది. లెఫ్టినెంట్ గవర్నర్ కూడా ఆమోదముద్ర వేశారు. దీంతో జనవరి 6న సమావేశం జరగనుంది అని అధికార వర్గాలు తెలిపాయి.

కలకత్తా హైకోర్టుకు వెళ్లండి

బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచన

న్యూదిల్లీ: బెంగాల్‌లోని పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో తొక్కిసలాట క్రమంలో బీజేపీ నేత సువేందు అధికారిపై ఎఫ్ఐఆర్ నమోదు కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బెంగాల్ ప్రభుత్వ పిటిషన్‌ను పరిశీలించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ వాదనలు వినిపించారు. సంబంధిత కేసులో ఎఫ్ఐఆర్ నమోదుపై స్టే విధిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో సవరణలను కోరుతున్నామన్నారు. ఈ ఆదేశాలు జారీచేసిన హైకోర్టు న్యాయమూర్తి అందుబాటులో లేనందున సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన సుప్రీం ధర్మాసనం ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పిటిషన్‌ను విచారించలేం. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆశ్రయించండి' అని సూచించింది. దీంతో పిటిషన్‌ను బెంగాల్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. కాగా, బుధవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి ముగ్గురు చనిపోగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కార్యక్రమానికి సువేందు అధికారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

దిల్లీకి అమరావతి రైతులు

- రేపు జంతర్‌మంతర్ వద్ద ధర్నా
- ప్రత్యేక రైలులో ఉద్యమకారులు
- సీపీఐ, కాంగ్రెస్ సంఘీభావం
- ఇకనైనా కేంద్రం స్పందించాలి: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అమరావతి రాజధాని రైతులు హస్తిన బాట పట్టారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర అసెంబ్లీలో ఏపీకి మూడు రాజధానుల ప్రకటన చేసి ఈనెల 17వ తేదీకి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశ రాజధాని దిల్లీలో తమ నిరసనను తెలియజేసేందుకు రైతులు గురువారం విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో సుమారు 1500 మంది తరలివెళ్ళారు. 17న దిల్లీలో జంతర్‌మంతర్ వద్ద అమరావతి రాజధాని ప్రాంత రైతులు ధర్నా చేపట్టనున్నారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున 18, 19 తేదీల్లో వివిధ రాజకీయపార్టీ నేతలను, ఎంపీలను కలిసి అమరావతి రాజధాని విధ్వంసానికి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వివరించి, రైతుల ఉద్యమానికి మద్దతు కోరనున్నారు. గురువారం విజయవాడ నుంచి రైలులో బయల్దేరిన రైతుల బృందానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతోపాటు ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, విజయవాడ నగర సీపీఐ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. అలాగే ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతో పాటు, కాంగ్రెస్ రాష్ట్ర నేతలు సుంకర పద్మశ్రీ, నరహరశెట్టి నర్సింహారావు తదితరులు రైతులకు సంఘీభావం తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మూడు రాజధానులు వొద్దు, అమరావతే ముద్దు అంటూ రాజధాని రైతులతో కలిసి పార్టీ శ్రేణులు నినదించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ నాడు అమరావతి రాజధానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రాజధాని ప్రాంతంలో నిర్మాణాల కోసం నిధులు కేటాయించారని గుర్తుచేశారు. రాజధాని అంశంపై సీఎం జగన్‌తో ప్రధాని మోదీగానీ, అమిత్‌షాగానీ ఒక్క మాట చెబితే పరిష్కారమవుతుందన్నారు. ఇప్పటికైనా రాజధానిపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని, మోదీ, జగన్ డ్రామాలు కట్టిపెట్టి, అమరావతే ఏకైక రాజధానిగా ప్రకటించాలన్నారు. రాజధాని ప్రాంతం వారితోపాటు ప్రత్యేకంగా 29 గ్రామాల రైతులు దాదాపు వెయ్యి రోజుల నుంచి పోరాటాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇంత సుదీర్ఘకాల పోరాటాన్ని దేశంలో ఎక్కడా కొనసాగలేదన్నారు. దిల్లీ సరిహద్దులో రైతుల చేపట్టిన పోరాటం ఒక్క ఏడాది మాత్రమే జరిగిందని వివరించారు. మూడేళ్ల నుంచి పోరాటం జరుగుతున్నప్పటికీ కేంద్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అటు ప్రధాని మోదీ సైతం తెలంగాణలో వైఎస్ షర్మిల అరెస్టుపై ఆరా తీస్తారేగానీ, అదే ప్రధాని మోదీ సుదీర్ఘకాలంపాటు ఉద్యమిస్తున్న రాజధాని ప్రాంత మహిళలపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేసి, అరెస్టులు చేసినా పట్టనట్టు ఉండటం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలోని ఒక్క వైసీపీ మినహా అన్ని పార్టీలు రాజధాని రైతుల ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్నాయన్నారు. దిల్లీలో రైతులు చేపట్టనున్న ధర్నా విజయవంతం కావాలని రామకృష్ణ ఆకాంక్షించారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి అమరావతే ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వోద్యోగుల అవినీతి...

పరోక్ష సాక్ష్యాలూ కీలకమే: సుప్రీం



న్యూదిల్లీ: అవినీతికి, లంచగొండితనానికి పాల్పడిన ప్రభుత్వ అధికారులను దోషులుగా తేల్చడానికి సంబంధించి సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. అవినీతి కేసుల్లో ప్రభుత్వ అధికారులను దోషిగా తేల్చడానికి, అవసరమైతే, పరోక్ష సాక్ష్యాలు కూడా పరిగణనలోకి తీసుకోవచ్చని స్పష్టంచేసింది. అవినీతి కేసుల్లో బాధితులు ప్రత్యక్ష లేదా మౌఖిక లేదా లిఖితపూర్వకసాక్ష్యాలను కోర్టు ముందు సమర్పించలేని పరిస్థితుల్లో...నేరాన్ని నిర్ధారించగల పరోక్ష సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకుని ఆ అధికారులను దోషులుగా తేల్చవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. సంబంధిత కేసు విచారణ సందర్భంగా జస్టిస్ ఎస్ఏ నజీర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడిన అధికారులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా ఫిర్యాదుదారులతో పాటు ప్రాసిక్యూషన్ సరైన జాగ్రత్తలు తీసుకుని, అన్ని రకాల సాక్ష్యాధారాలు సేకరించాలని ధర్మాసనం సూచించింది. అవినీతి అధికారులకు శిక్ష పడేలా చూడటం ద్వారానే స్వచ్ఛమైన, సుపరిపాలన, అవినీతి రహిత పరిపాలన సాధ్యమవుతుందని జస్టిస్ నజీర్ అధ్వర్యంలోని రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్యానించింది. అవినీతిని నిర్ధారించేందుకు ప్రత్యక్ష సాక్ష్యాధారాలే కీలకమని, అయితే, బాధితుడు మరణించడమో లేక వేరే ఇతర కారణాల వల్ల ప్రత్యక్ష సాక్ష్యాధారాలు సేకరించలేకపోవడమో జరిగినప్పుడు...నేరాన్ని నిర్ధారించగల పరోక్ష ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని జస్టిస్ నాగరత్న, జస్టిస్ బోపన్న, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వి.రామసుబ్రమణ్యం కూడా సభ్యులుగా ఉన్న ధర్మాసనం స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడ్డారని లేదా లంచం డిమాండ్ చేశారని నిర్ధారించే ప్రత్యక్ష సాక్ష్యాధారాలు లేవన్న కారణంతో నిందితుడిని నిర్దోషిగా పేర్కొంటూ క్లీన్‌చిట్ ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించింది.

9 వికెట్లతో ముంబై ఘనవిజయం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ఆంధ్రప్రదేశ్ జట్టుతో జరిగిన రంజీ మ్యాచ్‌లో ముంబై తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. స్థానిక పీవీజీ రాజు క్రికెట్ మైదానంలో జరిగిన రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 238 పరుగులు చేయగా, ముంబై మొదటి ఇన్నింగ్స్‌లో 331 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. మొదటి ఇన్నింగ్స్‌లో ముంబై బ్యాట్స్‌మేన్ అమాన్ జాఫర్ 116 పరుగులు, ధనుష కోటియా 64 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 131 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 40 పరుగులు చేయాల్సిన ముంబై జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6.1ఓవర్లలో పరుగులు సాధించి విజేతగా నిలిచింది. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో రాణించిన తనుష్ కొటియా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈ విజయంతో ముంబై జట్టు ఆరు పాయింట్లు సాధించుకుంది.

భారత్‌కు చివరి రఫేల్

ఫ్రాన్స్‌తో ముగిసిన యుద్ధవిమానాల ఒప్పందం

న్యూదిల్లీ: భారత్‌కు చివరి రఫేల్ యుద్ధవిమానం చేరుకుంది. దీంతో ఫ్రాన్స్‌తో 36 యుద్ధ విమానాల తయారీకి కుదిరిన ఒప్పందం పూర్తి అయింది. 36వ రఫేల్ యుద్ధవిమానం చేరుకున్నదని భారతీయ వైమానిక దళం గురువారం ట్విట్టర్‌లో ప్రకటించింది. 'ఫ్లీట్ డ్రై ! ప్యాక్ కంప్లీట్' 36 రఫేల్ యుద్ధ విమానాలు భారత్‌కు చేరుకున్నాయని ఐఏఎఫ్ ట్వీట్ చేసింది. రూ.59వేల కోట్ల విలువ చేసే 36 రఫేల్ యుద్ధ విమానాల కోసం 2016లో ఫ్రాన్స్‌తో భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. 2020 జులై 27న ఐదు విమానాలతో తొలి బ్యాచ్ అంబాలాలోని ఐఏఎఫ్ శిబిరానికి చేరగా వాటిని 'గోల్డెన్ ఆరోస్'గా 17వ స్క్వాడ్రన్‌లో భాగం చేశారు. రఫేల్ ఒప్పందం జాతీయ భద్రతలో కీలక పాత్ర పోషిస్తుంది. వీటి ప్రవేశం ప్రపంచానికి, భారతదేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తున్న దేశాలకు బలమైన సందేశం' అని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. చైనాతో సరిహద్దు వివాదం సమయంలో యుద్ధ విమానం చేరుకోవడం ప్రాధాన్యతను సంతరించుకంది. ఈ విమానాల్లో హెల్మెట్-మౌంటెడ్ సైట్, రాడార్ వార్నింగ్ రిసీవర్స్, డేటా రికార్డర్స్, ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్, ట్రాక్ సిస్టమ్, టోవ్డ్ డికాయ్స్, మిస్సైల్ అప్రోచ్ వార్నింగ్ బెల్స్ వంటి అత్యాధునిక లక్షణాలు ఉన్నాయి. కాగా గతనెలలో జోధ్‌పూర్‌లో జరిగిన 'గరుడ-7' విన్యాసాల్లో భాగంగా రఫేల్ యుద్ధ విమానాన్ని ఐఏఎఫ్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ఎగురవేశారు. ఫ్రెంచ్ ఎయిర్ చీఫ్ జనరల్ స్టెఫాన్ మిల్లే ఐఏఎఫ్ సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానాన్ని ఎగురవేశారు.

ఎన్‌టీఆర్-30లో ఇద్దరు కథానాయికలు

హైదరాబాద్: 'ఆర్ఆర్ఆర్'తో దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువైన నటుడు జూనియర్ ఎన్టీఆర్. ఈ సినిమా ఇచ్చిన జోష్‌తో తన తర్వాతి ప్రాజెక్టు అంతకు మించి ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నాడు. టాప్ డైరెక్టర్ కొరటాల్ శివ దర్శకత్వంలో నటించడానికి ఒకే చెప్పాడు. యువసుధా ఆర్ట్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ ప్రాజెక్టు వర్కింగ్ టైటిల్‌గా 'ఎన్‌టిఆర్ 30' అని వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌ను ఇప్పటి వరకు ఎంపిక చేయలేదు. కథానాయిక ఛాన్స్ కోసం ఇద్దరు అందాల భామలు పోటీపడుతున్నట్టు ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్‌కు నిర్మాతలు కథ వినిపించగా అంగీకారం తెలిపిందని సమాచారం. కానీ, కాంట్రాక్ట్‌పై సంతకం చేయలేదని తెలుస్తోంది. డేట్స్ అందుబాటును బట్టి సైన్ చేయనుందట. ఒకవేళ ఆమె కనుక ప్రాజెక్టుకు సంతకం చేస్తే టాలీవుడ్ ఇండస్ట్రీకి ఘనంగా స్వాగతం చెప్పాలని చిత్రబృందం ఆలోచిస్తుందట. అనివార్య కారణాల వల్ల జాన్వీ నటించలేకపోతే రష్మిక మందన్నా వైపు మేకర్స్ చూస్తున్నారట. 'ఎన్‌టీఆర్30' అండర్ వాటర్ యాక్షన్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతుంది. పాన్ ఇండియాగా తెరకెక్కుతుంది. సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతోంది. జనవరిలో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని మేకర్స్ ఆలోచిస్తున్నారు. ఫిబ్రవరి నుంచి షూటింగ్ ప్రారంభించనున్నారని ఫిల్మ్ నగర్ వర్గాలు తెలుపుతున్నాయి.

సుకుమార్ మనసులో పుష్ప-3

హైదరాబాద్: అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' ఎంతగా విజయం సాధించిందో తెలిసిందే. ఆ సినిమాలో పాటలు, డైలాగులు ఇప్పటికీ హల్‌చల్ చేస్తూనే ఉన్నాయి. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'పుష్ప2' కూడా తెరకెక్కుతోంది. పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించిన ఈ చిత్రం కథ రాసేటప్పుడు దర్శకుడు సుకుమార్‌కి రెండు పార్టులుగా తీయాలనే ఆలోచన లేదు. సినిమా నిడివి ఎక్కువ కావడంతో రెండు పార్టులుగా ప్లాన్ చేశారు. అందులో మొదటి ప్రయత్నం అద్భుత విజయం సాధించింది. ఇప్పుడు అంతకుమించి విజయం సాధించేలా 'పుష్ప2' చిత్రం తెరకెక్కించే పనిలో ఉన్నారు లెక్కల మాస్టార్. తాజాగా ఈ చిత్రం గురించి మరో వార్త నెట్టింట వైరల్ అవుతోంది. సుకుమార్ మైండ్‌లో పుష్ప-3 ఐడియా కూడా పుట్టుకొచ్చేసిందట. ప్రస్తుతం రూపొందుతున్న పార్టు-2 క్లైమాక్స్‌లో మూడో భాగానికి బీజం పడేలా కథ రాశారట. పుష్ప మొదటి భాగంలో ఓ కూలీ స్మగ్లర్‌గా ఎలా ఎదిగాడో చూపించారు. పార్టు 2లో.. అతని ఉన్నతి, పతనం రెండూ చూపించబోతున్నారని తెలుస్తోంది. పార్టు-3లో అతను జీరోకి పడిపోయి మళ్లీ ఎలా ఎదిగాడు అన్నదే చూపించనున్నారట. అయితే 'పుష్ప-3' ఇప్పట్లో రాదు. దానికి కనీసం ఐదేళ్ల సమయం పడుతుందని సుకుమార్ సన్నిహితుల నుంచి సమాచారం.

నెటిజనులకు మమ్ముట్టి క్షమాపణలు



హైదరాబాద్: మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి సోషల్‌మీడియా వేదికగా నెటిజన్లకు క్షమాపణలు చెప్పారు. తాను చేసిన తప్పును తెలియజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అసలు విషయమేమిటంటే.. 2018లో కేరళలో సంభవించిన వరదల ఆధారంగా '2018' అనే చిత్రం రూపొందుతోంది. టాలెంటెడ్ డైరెక్టర్ జూడో ఆంథనీ జోసెఫ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇక ఈ సినిమా టీజర్ లాంఛ్ వేడుకలో మమ్ముట్టి దర్శకుడిని ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తప్పుపట్టారు. లాంఛ్ ఈవెంట్‌లో మమ్ముట్టి మాట్లాడుతూ 'జూడో తలపై వెంట్రుకలు లేకపోయినా, అద్భుతమైన మెదడు ఉన్న ప్రతిభావంతుడైన దర్శకుడు' అని అన్నారు. అయితే ఈ కామెంట్స్‌పై నెటిజన్ల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇలా మాట్లాడడం బాడీ షేమింగ్‌తో సమానమంటూ పోస్టులు చేశారు. దీనిపై మమ్ముట్టి క్షమాపణలు చెబుతూ తన అధికారిక సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 'డియర్ ఆల్... నిన్న జరిగిన '2018' టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో దర్శకుని ప్రశంసించేందుకు నేను వాడిన కొన్ని పదాలు మిమ్మల్ని బాధపెట్టాయని తెలిసింది. ఉత్సాహంతో అలాంటి మాటలు మాట్లాడినం దుకు క్షమించండి. మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్త పడతాను. ఈ తప్పును గుర్తుచేసినందుకు మీ అందరికీ ధన్యవాదాలు' అని రాశారు.

నిప్పులు చెరిగిన సిరాజ్... తిప్పేసిన కుల్దీప్

- మొదటి టెస్ట్‌లో ఎదురీదుతున్న బంగ్లాదేశ్
- బ్యాటింగ్‌లో రాణించిన అశ్విన్, కుల్దీప్



చత్తోగ్రామ్: బంగ్లాదేశ్, భారత్ జట్ల మధ్య చత్తోగ్రామ్‌లో జరుగుతున్న మొదటి టెస్టు రసవత్తరంగా సాగుతోంది. రెండో రోజు ఆట ప్రారంభమైన కాసేపటికే శ్రేయస్ అయ్యర్(86)ను హోస్సేన్ బౌల్డ్ చేశాడు. అయితే టెయిలెండర్లు రాణించడంతో భారత్ 404 పరుగులు చేసింది. భారత్‌ను తక్కువకే కట్టడి చేసిన ఆనందం బంగ్లాకు మిగలలేదు. పేసర్ సిరాజ్ తొలి బంతికే ఓపెనర్ శాంటోను ఔట్ చేశాడు. అంతేకాదు కీలకమైన లిట్టన్ దాస్(24) వికెట్ సాధించాడు. మరోవైపు ఉమేశ్ యాదవ్ కూడా విజృంభించడంతో బంగ్లాదేశ్ 56 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత చైనామన్ కుల్దీప్ యాదవ్ మ్యాజిక్ చేశాడు. షకిబుల్ హసన్ (3) వికెట్ తీశాడు. 32వ ఓవర్‌లో ముష్ఫికర్ రహీం (28)తో పాటు తైజుల్ ఇస్లాంను పెవిలియన్‌కు పంపాడు. అతను ఆరు ఓవర్లలో 4 వికెట్లు తీసి బంగ్లాను దెబ్బ కొట్టాడు. ఆటముగిసే సరికి మెహిదీ హసన్ మిరాజ్, ఎడబాట్ హోస్సేన్ క్రీజులో ఉన్నారు. బంగ్లాదేశ్ 271 పరుగులు వెనకబడి ఉంది. పేసర్ సిరాజ్, కుల్దీప్ తలా నాలుగు వికెట్లు పడగొట్టారు. ఉమేశ్ యాదవ్ ఒక వికెట్ తీశాడు. రెండో రోజు తొలి సెషన్‌లోనే టీమిండియా ఆలౌట్ అయింది. శ్రేయస్ అయ్యర్ (86 రన్స్) ఒక్క పరుగు కూడా చేయకుండానే ఔట్ అయ్యాడు. అయితే అశ్విన్(58), కుల్దీప్ (40) బంగ్లా బౌలర్లకు పరీక్ష పెట్టారు. వీళ్లిద్దరు మంచి భాగస్వామ్యం నిర్మించారు. అశ్విన్ 13 టెస్ట్ హాఫ్ సెంచరీ చేశాడు. ఈ మ్యాచ్‌లో కుల్దీప్ టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించాడు. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లాం, మెహిదీ హసన్ మిరాజ్ చెరో నాలుగు వికెట్లు తీశారు. ఖలెద్ అహ్మద్, ఎడబాట్‌కు ఒక్కో వికెట్ దక్కింది.

అమెరికా టీమ్ అంతా భారత సంతతే!

న్యూదిల్లీ: వచ్చే ఏడాది జనవరి తొలి వారంలో తొలిసారిగా జరిగే మహిళల అండర్-19 ప్రపంచకప్ పోటీలకు యూఎస్ఏ తన జట్టును ప్రకటించింది. ప్రతి దేశం తమ టీమ్‌లను ప్రకటిస్తుంది కదా.. ఇందులో వింతేముందంటారా? అయితే, ఇక్కడ రెండు ఆసక్తికరమైన విషయాలున్నాయి.

అమెరికా నుంచి తొలి మహిళా జట్టు

అమెరికా 2010లో పురుషుల అండర్ -19 జట్టు ప్రపంచకప్‌లో ఆడగా.. తాజాగా ఆ దేశ మహిళా జట్టు కూడా తొలిసారి ప్రపంచకప్ కోసం రంగంలోకి దిగింది. దక్షిణాఫ్రికా వేదికగా జనవరి 7వ తేదీ నుంచి జనవరి 29వ తేదీ వరకు టోర్నీ జరగనుంది. 16 జట్లు పాల్గొనే ఈ మెగా టోర్నీలో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంకతో కూడిన గ్రూప్-ఎలో యూఎస్ఏ తలపడనుంది.

అందరూ భారత మూలాలు ఉన్నవారే..

అండర్-19 ప్రపంచకప్ కోసం యూఎస్ఏ 15 మందితో కూడిన ప్రధాన జట్టును ఎంపిక చేసింది. కెప్టెన్‌గా గీతికా కొడాలి బాధ్యతలు నిర్వర్తించనుంది. అలాగే మిగతా వారంతా భారత మూలాలు కలిగిన క్రికెటర్లు కావడం గమనార్హం. వెస్టిండీస్ మాజీ స్టార్ బ్యాటర్ శివనారయణ్ చంద్రపాల్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తాడు. అలాగే మరో ఐదుగురిని రిజర్వ్‌లో ఉంచారు.

యూఎస్ఏ జట్టు ఇదే:

గీతికా కొడాలి (కెప్టెన్), అనికా కొలన్ (వైస్ కెప్టెన్), అదితి చుదసామ, భూమిక భద్రిరాజు, దిశా దింగ్రా, ఇసాని వంగేలా, జివానా అరాస్, లాస్య ముళ్లపూడి, పూజా గణేశ్, పూజా షా, రితు సింగ్, సాయి తన్మయి ఈయున్ని, స్నిగ్ధ పాల్, సుహాని తదాని, తరనుమ్ చోప్రా

రిజర్వ్: చేత్నా ప్రసాద్, కస్తూరి వేదాంతమ్, లిసా రంజిత్, మిథాలీ పట్వార్ధాన్, టై గోన్సాల్వేస్

టీ20 చరిత్రలో

హర్మన్‌ప్రీత్ అరుదైన రికార్డ్

ముంబై: మహిళల క్రికెట్‌లో భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. టీ20ల్లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళా క్రికెటర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ ఈ ఘనతను సాధించింది. ముంబై వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌తో ఈ యువ కెప్టెన్ 140 టీ20లు పూర్తిచేసింది. ఇందులో 125 ఇన్నింగ్స్‌ల్లో 27.36. సగటుతో 2,736 పరుగులు చేసింది. ఈ ఫార్మాట్‌లో 103 ఉత్తమ స్కోరుతో మొత్తం 8 అర్ధశతకాలు, 1 శతకాన్ని నమోదు చేసింది. హర్మన్‌ప్రీత్ తర్వాతి స్థానంలో 139 టీ20లు ఆడి న్యూజిలాండ్ ప్లేయర్ సుజీ బేట్స్ రెండో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్‌కు చెందిన డన్నీ వాట్(136) మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆస్ట్రేలియా ప్లేయర్స్ అలీస్సా హేలీ(135), ఎలీస్ పెర్రీ(129) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. ప్రస్తుతం 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన మూడో టీ20లో భారత జట్టుకు నిరాశ తప్పలేదు. భారత్‌ను 21 పరుగుల తేడాతో ఆసీస్ జట్టు ఓడించిన విషయం తెలిసిందే. ఈ ఓటమిపై హర్మన్‌ప్రీత్ కౌర్ స్పందిస్తూ స్ట్రైక్ రొటేట్ చేయడంలో వైఫల్యం జట్టు ఓటమికి కారణమైందని తెలిపింది. "ఆసీస్ జట్టు నిర్దేశించిన లక్ష్యాన్ని మేం కచ్చితంగా ఛేదిస్తామనే అనుకున్నాం. కానీ, దాదాపు ఏడు ఓవర్లలో 6 పరుగుల కన్నా తక్కువ స్కోర్ చేయడం మా జట్టును దెబ్బతీసింది. బౌండరీ కొట్టిన అనంతరం డాట్ బాల్స్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. స్ట్రైక్ రొటేట్ చేయాల్సిన చోట చేయలేకపోవడం మరో ప్రతికూల అంశంగా మారింది. బౌండరీలు కొట్టే సమయంలో వికెట్లను కోల్పోవడం కూడా నష్టం చేకూర్చింది" అని వెల్లడించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.